


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | శుక్రవారం 28-8-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:23 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# గాంధీ ఆస్పత్రి నుంచి నలుగురు ఖైదీల జంప్

## పోలీసుల కళ్లుగప్పి పరారైనట్లు గుర్తింపు
## వెంటనే రంగంలోకి దిగిన పోలీసు బృందాలు

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): కరోనా చికిత్స పొందుతున్న నలుగురు ఖైదీలు పోలీసలు కళ్లుగప్పి గాంధీ దవాఖాన నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి గాలింపు చేపట్టారు. చర్లపల్లి జైల్లో శిక్ష అనుభవిస్తున్న నలుగురు ఖైదీలకు కరోనా వైరస్ సోకింది. దీంతో వారిని నగరంలోని ఎర్రగడ్డ ఛాతీ దవాఖానకు తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించగా వారికి పాజిటివ్ వచ్చింది. దీంతో వారిని చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. వారికి దవాఖానలోని మొదటి అంతస్తులో ఉన్న ఖైదీల వార్డులో చికిత్స అందిస్తున్నారు. అయితే బాత్‌రూమ్ అని చెప్పిన వెళ్లిన ఆ నలుగురు ఖైదీలు బుధవారం అర్ధరాత్రి దవాఖాన నుంచి పారిపోయారు. కిటికీ గ్రిల్ తొలగించి పారిపోయారని అంటున్నారు. దీంతో ఆస్పత్రి సమీపంలో సీసీ పుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. వారికోసం దవాఖాన పరిసర ప్రాంతాల్లో పోలీసులు గాలిస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనే చోటుచేసుకున్నది. దవాఖాన నుంచి తప్పించుకున్న ఖైదీని పోలీసులు రెండు రోజుల్లోనే పట్టుకున్నారు. గాంధీ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నలుగురు ఖైదీల కోసం పోలీసులు గాలిస్తున్నారు. గాంధీ ఆస్పత్రిలోని కరోనా వార్డు నుంచి కోవిడ్‌తో చికిత్స పొందుతున్న నలుగురు జైలు ఖైదీలు ఎస్కార్ట్ పోలీసుల కళ్లుగప్పి పరారయ్యారు. గురువారం తెల్లవారుజామున మూడు గంటలకు పరారీ అయ్యారని సమాచారం. ఆస్పత్రి మెయిన్ బిల్డింగ్‌లోని రెండవ అంతస్తులో బాత్ రూమ్ గ్రిల్స్ తొలగించి పారిపోయారు. వీరిలో ఇద్దరు చంచల్‌గూడ రిమాండ్‌లో ఉన్న ఖైదీలు ఉన్నారు. మరొకరు చర్లపల్లి జైలులో శిక్ష ఖరారైన ఖైదీ కాగా ఇంకొకరు చర్లపల్లి జైల్లో శిక్ష ఖరారైన ఖైదీ. పరారిలో ఉన్న వారిలో అబ్దుల్ రబాజా రాజేంద్రనగర్ లో కేసులో నిందితుడు, ఎండి జావీద్ శ్యామ్ తాండూరు కేసులో నిందితుడు. సుందర్,నర్సింహా శిక్ష ఖరారైన ఖైదీలు. ఇక ఈ నలుగురు ఖైదీలు ఆస్పత్రి నుంచి పరారయిన వారిపై చిలకగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ కెమెరాల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. గాంధీ హాస్పిటల్‌లోనే ఇతర వార్డుల్లో నక్కి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం గాంధీ హాస్పిటల్లో గాలింపు చర్యలు చేపట్టారు.

# సుల్తాన్ బజార్‌లో కూలిన పాత స్కూల్ భవనం

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లో ఓ పాత స్కూల్ భవనం కుప్పకూలింది. రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల వల్ల పాత ఇళ్లు, బిల్డింగులు కూలిపోతున్నాయి. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల వల్ల గోడలు పూర్తిగా నాని మెత్తబడటంతో సుల్తాన్ బజార్‌లోని ఓ స్కూల్ బిల్డింగ్ గురవారం కుప్పకూలిపోయింది. అయితే కరోనా కారణంగా పాఠశాల మూతపడటంతో పాటు, రాత్ర సమయం కావడంతో ప్రమాదం తప్పింది. వెంటనే స్పందించిన డిజాస్టర్ టీం, జీహెచ్ఎంసీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని శిథిలాలను తొలగిస్తున్నారు. భవనం పాతది కావడంతో శిథిలావస్థకు చేరింది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు భవనంనానడంతో ఒక్కసారిగా కుప్పకూలింది.




హైదరాబాద్ సుల్తాన్ బజార్‌లో వర్షాలకు కుప్పకూలిన పురాతన స్కూలు భవనం




7.ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారుల సమావేశంలో యాప్‌ను విడుదల చేసిన రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# ఎన్‌సిసి యాప్‌ను ప్రారంభించిన రాజ్‌నాథ్

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం ప్రారంభించారు. 'డీజీఎన్‌సీసీ (డైరెక్టరేట్ జనరల్ నేషనల్ క్యాడెట్ కార్ప్స్) ట్రైనింగ్' యాప్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజ్‌నాథ్ ఆవిష్కరించారు. కరోనా నేపథ్యంలో ఎన్‌సీసీ శిక్షణ కార్యక్రమాలు నిలిచిపోయాయి. అయితే డీజీఎన్‌సీసీ మొబైల్ ట్రైనింగ్ యాప్ ఆ లోటును తీరుస్తుందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్లు డిజిటల్ మాధ్యమంలో శిక్షణ పొందేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. కరోనా నేపథ్యంలో విధించిన నిబంధనల వల్ల ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రత్యక్షంగా శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనలేని ఇబ్బందులను ఈ యాప్ ద్వారా అధిగమించవచ్చని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ÷ప్టెంబర్ సమీపిస్తున్నా కరోనా కారణంగా స్కూళ్లు, కాలేజీలు తెరుచుకోలేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎన్‌సీసీలో శిక్షణ పొందలేకపోతున్నారు. కాగా ఈ లోటును అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం డీజీఎన్‌సీసీ శిక్షణ మొబైల్ యాప్‌ను రూపొందించింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ యాప్‌ను గురువారం ప్రారంభించారు.

# ప్లాస్మాదాతలు దేవుడితో సమానం

## హోంమంత్రి సమక్షంలో దాతలను సన్మానించిన సిపి

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): ప్లాస్మా దానం చేసిన ప్రతి ఒక్కరూ దేవుడితో సమానమని సైబరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ సీపీ కార్యాలయంలో హోం మంత్రి మహమూద్ అలీతో కలిసి ప్లాస్మా దాతలను సీపీ సజ్జనార్ సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. లాక్‌డౌన్ సమయంలో సైబరాబాద్ పోలీసులు 5,300 బ్లడ్ యూనిట్లు సేకరించినట్లు చెప్పారు. 600 మంది ప్లాస్మా దానం చేసి 1,350 మంది ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. ప్లాస్మాదానంలో వాలంటీర్లు, కరోనా నియంత్రణలో మీడియా పాత్ర కీలకమన్నారు. ప్లాస్మా దానంలో తెలంగాణ మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని సీపీ పేర్కొన్నారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి పోలీసు శాఖకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో పోలీసుల సేవ ఎనలేనిదని కొనియాడారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సైతం తెలంగాణ పోలీసుల పనితీరు మెచ్చుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. ప్లాస్మా దానం చేసిన ప్రతి ఒక్కరికీ మహమూద్ అలీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరూ మాస్క్, శానిటైజర్ తప్పనిసరిగా వాడాలని ఈ సందర్భంగా సూచించారు.

# గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): గాంధీ హాస్పిటల్‌లో విధినిర్వహణలో ఉన్న ఓ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతిచెందారు. 2014 బ్యాచ్‌కు చెందిన అంపోలు క్రాంతి కుమార్ హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా బుధవారం రాత్రి 8 గంటలకు గాంధీ దవాఖానలో రిపోర్టు చేశారు. రాత్రి సమయంలో ఆయనకు గుండెపోటు రావడంతో హుటాహుటిన నిమ్స్ దవాఖానకు తరలించారు. అయితే అప్పటికే కానిస్టేబుల్ మరణించినట్లు డాక్టర్లు చెప్పినట్లు బోయిన్‌పల్లి పోలీసులు తెలిపారు.

# పంటలసాగులో తెలంగాణది మొదటిస్థానం

## నదీజలాలు పారుతున్న తీరుతో రైతాంగంలో భరోసా
## సిఎం కెసిఆర్ ముందుచూపే ఇందుకు నిదర్శనం
## ఆనందంగా ఉందంటూ కెటిఆర్ ట్వీట్

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది వానాకాలం పంటల సాగులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలవడంపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందుచూపుతో నీటినిల్వలు పెరిగి రైతులకు భరోసా దక్కిందన్నారు. ఒకనాడు సాగునీరులేక నెర్రెలు బారిన ఈ నేల, నేడు రైతుబంధు సీఎం కేసీఆర్ నేతృత్వంలో నదీ జలాలు పారగా వ్యవసాయంలో నూతన రికార్డులు సృష్టిస్తున్నదని అన్నారు. ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రిగా ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణను సస్యశ్యామలం చేస్తుంటే, రైతన్న కళ్లలో మురిపెం కనపడుతున్నదని ట్వీట్ చేశారు. గత వానాకాలం పంటతో పోలిస్తే రాష్ట్రంలో 36.59 శాతం పెరిగింది. గతేడాది వానాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా 1.02 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవగా, ఈ ఏడాది 1.34 కోట్ల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఈ ఏడాది 41.76 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే దీనికంటే 5 లక్షల ఎకరాల్లో అధికంగా వరినాట్లు పడ్డాయి. అదేవిధంగా 60.16 లక్షల ఎకరాల్లో పత్తి సాగు లక్ష్యంగా నిర్ణయించగా, 58.92 లక్షల ఎకరాల్లో పత్తిసాగు జరిగింది. మిగిలిన పంటలు కూడా దాదాపు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగానే సాగయ్యాయని వ్యవసాయ శాఖ గణాంకాలు పేర్కొన్నాయి. వానాకాలం పంటలసాగులో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. పంటల సాగు వృద్ధిలో తెలంగాణ తర్వాత 36 శాతంతో జార్ఖండ్, 35.14 శాతం పెరుగుదలతో తమిళనాడు రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ప్రభుత్వం మెరుగైన సాగునీటి వసలు కల్పించడతోనే ఇది సాధ్యమయ్యిందని విశ్లేషకులు అంటున్నారు. రైతుబంధు అందించడంతోపాటు, వ్యవసాయ రుణాలు మాఫీ చేయడం, సకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడం కూడా అధిక పంటల సాగుకు దోహదం చేసిందని కెటిఆర్ పేర్కొన్నారు. సిఎం కెసిఆర్ ఆశించినవిధంగా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునే క్రమంలో పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని అన్నారు.

# స్థిరంగా భారత బ్యాంకింగ్ వ్యవస్థ

## కరోనా సంక్షోభంలోనూ అదుపులోనే ఆర్థిక పరిస్థితి
## ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ వెల్లడి

ముంబై,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ సురక్షితంగా, స్థిరంగా ఉన్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు. ప్రస్తుత కరోనా సంక్షోభ సమయంలో ఆర్థిక పరిస్థితిని అదుపులో ఉంచేందుకు తగిన శక్తి సామర్థ్యాలు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వద్ద మెండుగా ఉన్నాయని, మొత్తంమీద భారత బ్యాంకింగ్ వ్యవస్థ ధృఢంగానే ఉందని దాస్ గురువారం వెల్లడించారు. ఈ సంక్షోభం ముగిసిన అనంతరం ఆర్థిక స్థిరీకరణకోసం చాలా జాగ్రత్తగా, నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, సంబంధిత చర్యలను ఆర్‌బీఐ చేపట్టనుందని స్పష్టం చేశారు. అలాగే బ్యాంకులు తమ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలన్నారు. ఒక వెబ్‌నార్ సిరీస్ ఈవెంట్ ముఖ్య ప్రసంగంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

సెంట్రల్ బ్యాంకింగ్ విధానాలు కానీ .. రేటు తగ్గింపు అంశంలో తమ విధానాలను మార్చలేదన్నారు. తాము నిరంతరమూ జాగ్రత్తగా ఉన్నట్లు చెప్పారు. ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైతే.. దాన్ని ఎదుర్కొనే రీతిలో ఉన్నట్లు ఆర్బీఐ గవర్నర్ దాస్ తెలిపారు. ఫ్రాడ్ కేసులు పెరుగుతున్న అంశంలో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకుల వద్ద లక్ష రూపాయల కన్నా ఎక్కువ మోసం చేసిన కేసుల సంఖ్య 159 శాతం పెరిగినట్లు ఇటీవల ఆయన చెప్పారు. 2020 వార్షిక సంవత్సరం సుమారు రూ.1.86 ట్రిలియన్ ఫ్రాడ్ జరిగినట్లు రిపోర్ట్ ఇచ్చారు. అయితే భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు చేపట్టాల్సి ఉందన్నారు. ఆర్థిక వ్యవస్థ రక్షణ చర్యల్నివెంటనే నిలిపివేయడం లేదని, పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ చర్యల్ని నిలిపివేసిందన్న ఊహాగానాలకు అర్థం లేదన్నారు. సంబంధిత చర్యలపై ఆర్‌బీఐ దీర్ఘకాలిక ప్రయోజనాల రీత్యా రేట్లలో మార్పులు చేయాల్సి ఉంటుందన్నారు. కరోనా వ్యాప్తి ఎలా ఉండబోతోందనే దానిపై స్పష్టత రాగానే ద్రవ్యోల్బణం, అభివృద్ధికి సంబంధించిన గణాంకాలను ఆర్‌బీఐ విడుదల చేస్తుందని శక్తికాంత్ దాస్ పేర్కొన్నారు. రేట్ల కోత అయినా, లేదా ఇతర విధానపరమైన చర్యల నిమిత్తం అయినా ఆర్‌బీఐ దగ్గర అస్త్రాలు ఇంకా మిగిలే ఉన్నాయంటూ భరోసా ఇచ్చారు. మహమ్మారి కట్టడి అనంతరం ఆర్థిక రంగం సాధారణ స్థితికి చేరుకునేందుకు జాగ్రత్తగా బాటలు వేయాల్సిన అవసరం ఉందని దాస్ ఉద్ఘాటించారు. ఏదేమైనా, ఈ చర్యలను త్వరలోనే ముగిస్తుందని ఏ కోణంలోనూ భావించరాదని ఆయన స్పష్టం చేశారు. అతిగా రక్షణాత్మక వైఖరి అవలంబించడం ద్వారా చివరికి బ్యాంకులకే నష్టం కలుగుతుందని ఆయన చెప్పారు. కరోనా ఒత్తిడిని ఎదుర్కొంటున్న రుణగ్రహీతలకు రిజల్యూషన్ ఫ్రేమ్‌వర్క్ మంచి ఉపశమనం ఇస్తుందని చెప్పారు. లాక్‌డౌన్ సందర్భంలోరుణాలపై తాత్కాలిక నిషేధం తాత్కాలిక పరిష్కారం మాత్రమేనన్నారు. ఈ సమయంలో బ్యాంకులు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయనేది స్పష్టం..కానీ, ఈ సవాళ్లకు ఎలా స్పందిస్తాయి, ఎలా ఎదుర్కొంటాయినేది కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు మహమ్మారిపై కట్టడిలో కేంద్రం ప్రభుత్వం స్పందించిన తీరునున దాస్ ప్రశంసించారు.

# కొత్తగా మరో 2,797 కేసులు నమోదు

## 86,089 మంది కోలుకుని డిశ్చార్జ్
## పోలీస్ శాఖను కలవరపెడుతున్న కరోనా

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా పాజిటివ్ కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. కొత్తగా మరో 2,797 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. గడిచిన 24 గంటల్లో కరోనాతో 8 మంది మృతి చెందారు. దీంతో రాష్ట్రంలో మొత్తం 1,14,483 కరోనా కేసులు నమోదు కాగా...మొత్తం 789 మరణాలు సంభవించాయి. ప్రస్తుతం తెలంగాణలో 27,600 యాక్టివ్ కేసులు ఉన్నాయి. 86,089 మంది కరోనా నుంచి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. కొత్తగా జీహెచ్ఎంసీ 449, రంగారెడ్డి 268, నల్గొండ 164, ఖమ్మం 152 కేసులు నమోదు అయ్యాయి. అలాగే కరీంనగర్ 136, వరంగల్ అర్బన్ 132, మేడ్చల్ 113, నిజామాబాద్ 112 కేసులు, మంచిర్యాల 106, సిద్ధిపేట 113, మహబూబాబాద్ 102 కేసులు నమోదు అయ్యాయి. తెలంగాణలో ఇప్పటి వరకు 11,42,480 కరోనా టెస్టులు నిర్వహించారు. మరోవైపు రాష్ట్ర పోలీస్ శాఖలో కరోనా కేసులు కలవర పెడుతున్నాయి. పోలీస్ శాఖలో మొత్తం 5,684 పోలీసు సిబ్బంది కరోనా బారిన పడ్డారు. వీరిలో 2,284 మంది డిశ్చార్జ్ అవగా... 3,357 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇప్పటి వరకు 44 మంది పోలీసులు కరోనాకు బలయ్యారు. అమరలైన వారిలో కానిస్టేబుల్ నుంచి అడిషనల్ ఎస్పీ ర్యాంక్ వరకు ఉన్నారు. మొత్తం డిపార్ట్‌మెంట్‌లో54 వేల మంది సిబ్బంది ఉండగా... పది శాతం మందికి కరోనా సోకింది. కరోనా కేసుల్లో హైదరాబాద్ కమిషనరేట్ టాప్‌లో ఉంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,967 మంది కరోనా బారిన పడగా... అందులో 891 మంది చికిత్స పొందుతున్నారు. 1053 మంది రికవరీ అవగా... 23 మంది కరోనాతో మృతి చెందారు. తర్వాతి స్థానంలో వరంగల్ నిలిచింది. వరంగల్‌లో 526 కేసులు ఉండగా, 361 మంది చికిత్స పొందుతున్నారు. 163 మంది కరోనా నుంచి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. కాగా కరోనాకు ఇద్దరు పోలీసులు బలి అయ్యారు. ఇదిలావుంటే మెదక్ జిల్లాలో కరోనా కల్లోలం సృష్టిస్తుంది. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ వేగంగా వ్యాప్తి చెందుతున్నది. బుధవారం జిల్లావ్యాప్తంగా 1,002 మందికి ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా 148 మందికి కరోనా సోకినట్లు తేలింది. దీంతో వైరస్ బారినపడిన వారి సంఖ్య 1,352కు పెరిగింది. మండలాల వారీగా పరిశీలిస్తే మెదక్ టౌన్ 19, ఉమ్మడి రామాయంపేట 18, చేగుంట 14, చిన్నశంకరంపేట 12, తూప్రాన్ 12, నిజాంపేట 11, వెల్దుర్తి 10, పాపన్నపేట 10, కౌడిపల్లి 9, హవేళిఘనపూర్ 7, నార్సింగ్ 6, పెద్దశంకరంపేట 4, టేక్మాల్ 4, నర్సాపూర్ 3, అల్లాదుర్గం 3, శివ్వంపేట 3, కొల్చారం 1, చిల్‌పచెడ్ 1, రేగోడ్ 1 చొప్పున కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. కరోనాతో బుధవారం మరొకరు మృతి చెందారు. రామాయంపేట పట్టణానికి చెందిన ఓ తాపీమేస్త్రీ (45)కి వారంరోజుల క్రితం కరోనా పాజిటివ్ రాగా, సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే బుధవారం మధ్యాహ్నం ఆస్పత్రిలోనే ప్రాణాలు వదిలాడు. తూప్రాన్ పట్టణానికి చెందిన వ్యాపారి (70) కరోనాతో మృతిచెందాడు. 20న దంపతులిద్దరికీ కొవిడ్-19 పాజిటివ్ రావడంతో సిద్దిపేట జిల్లా లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న వ్యాపారి బుధవారం ఉదయం మృతిచెందాడు. ఎర్రగడ్డలోని శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు.




సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో హోంమంత్రి మహ్మూద్ అలీ సమక్షంలో ప్లాస్మాదాతలను సన్మానించిన సిపి సజ్జన్నార్

# యువత సామర్థ్యం, నైపుణ్యాన్ని ప్రోత్సహించాలి: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ. ఆగష్టు 27: భారతదేశాన్ని ఆత్మనిర్భర దేశంగా తీర్చిదిద్దేందుకు యువతలోని సామర్థ్యాన్ని ప్రోత్సహించి సరైన శిక్షణను అందించాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ప్రతి భారతీయుడిలో ఉన్న ప్రత్యేకమైన నైపుణ్యాన్ని తట్టిలేపి స్థానిక వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా స్వయంసమృద్ధి సాధించడమే గాక, సమాజానికి దీర్ఘకాలంలో మేలు జరిగేందుకు చొరవ తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉన్నదన్నారు.

ఆచార్య వినోబాభావే 125వ జయంతిని పురస్కరించుకుని హరిజన్ సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇంటర్నెట్ వెబినార్ వేదికగా ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేయడంతో పాటు, భూదాన ఉద్యమం ద్వారా సమాజంలోని అంతరాలను తగ్గించేందుకు ప్రయత్నించిన కృషీవలుడు ఆచార్య వినోబా భావే అని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాలకు పునర్వైభవం తీసుకురావడం ద్వారా వారు స్వప్నించిన గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు ప్రతి



ఒక్కరూ కృషిచేయాలన్నారు.

మహాత్మాగాంధీకి ఆదర్శవంతమైన శిష్యుడిగా ఆచార్య వినోబాభావే చేసిన కృషిని శ్లాఘించిన ఉపరాష్ట్రపతి.. భారతీయతతోపాటు సేవ, త్యాగాలను వినోబా భావే పుణికిపుచ్చుకున్నారని చెప్పారు. ఎవరినీ బలవంత పెట్టకుండా, హింసకు తావులేకుండా ప్రజల భాగస్వామ్యంతో వినోబా భావే చేపట్టిన భూదానోద్యమం ద్వారా వచ్చిన మార్పును నేటి తరానికి తెలియజెప్పాల్సిన అవసరం ఉన్నదన్నారు. 14 ఏళ్ల పాటు దాదాపు 70వేల కిలోమీటర్లు కాలినడకన తిరిగి 42 లక్షల ఎకరాల భూమిని సేకరించి రైతులకు పంచిన వారి ఉద్యమస్ఫూర్తిని యువత ప్రేరణగా తీసుకోవాలన్నారు. వినోబా భావే ఇచ్చిన పిలుపుతో తెలంగాణలోని పోచంపల్లిలో వెదిరె రామచంద్రారెడ్డి స్వచ్ఛందంగా ఇచ్చిన 100 ఎకరాల భూమిని దానం చేయడంతో ఈ ఉద్యమం మొదలైన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేశారు.

మన దేశ జనాభాలో 60 శాతం గ్రామాల్లోనే నివసిస్తున్నారన్న ఉపరాష్ట్రపతి.. వారి అభ్యున్నతికి సమగ్ర కృషి జరగడమే ఆచార్య వినోబాభావే 125వ జయంతి సందర్భంగా వారికిచ్చే ఘనమైన నివాళి అని తెలిపారు. కరోనా పోరాటంలో ముందు వరసలో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, పోలీసులు, జర్నలిస్టుల సేవలు మరువలేనివన్నారు. వీరితోపాటు దేశంలో ఆహారభద్రతకు భరోసా కల్పిస్తూ.. ఆహారోత్పత్తికి స్వేదం చిందిస్తున్న అన్నదాతల అలుపెరగని శ్రమను గుర్తుచేసుకోవాలని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హరిజన్ సేవక్ సంఘ్ అధ్యక్షుడు డాక్టర్ శంకర్ కుమార్ సన్యాల్, కార్యదర్శి డాక్టర్ రజనీశ్ కుమార్‌తోపాటు పలువురు గాంధేయవాదులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొన్నారు.ంఉ ఎనితిటజీ ఎతిఇవ ఖతీవబతిటవనిబి ఎవనిఎజీఎజీ ఔజీతిటబీ

## చరిత్రలో నేటినిజం



కం|| క్రమమైన ప్రశిక్షణ గూ
సుమనోహరముగ నటించు శోభితగుణుడౌ
"సుమను"కు నేనందించెద
విమలాత్మునిగా దలంచి వేలాది నుతుల్ ||



( ఆగష్టు 28 హీరో సుమన్ జననం..)

-రాధశ్రీ

సెల్: 9494481210

# ఇంకెన్నాళ్లీ పర్యావరణ విధ్వంసం

నేటి నిజం
శుక్రవారం 28-8-2020

ఈ యేడు కూడా భారీ వర్షాలు కురిసినా లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలు కాక తప్పలేదు. సముద్రం పాలు కాకుండా నీటిని ఒడిసి పట్టి తరవాతి కాలంలో ఉపయోగించే ప్రణాళికలు ఇంకా రూపుదిద్దు కోవడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ తరహా ఆలోచనలు చేయకపోవడంతో ఏటా వరదల్లో ప్రజలు మునిగిపోతున్నారు. నదులు ఉప్పొంగినప్పుడు వేలాదిగ్రామాలు వరదల్లో చిక్కుకుంటున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ యేడు కూడా వర్షాలు అధికంగానే కురిసాయి. ఉత్తరాదితో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురిశాయి. అయితే కృష్ణా,గోదావరి జలాలు మళ్లీ సముద్రం పాలు కాక తప్పలేదు. వరదల్లో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నా పట్టించుకోలేదు. ఎపి, తెలంగాణలో పలుప్రాంతాలతో పాటు ఉత్తరాదిలో వరదలు ముంచెత్తాయి. బీహార్,గుజరాత్,అసోం ,కేరళ తదితర రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలు, పట్టణాలు వరదనీటిలో మునిగిపోయాయి. వరదలు వస్తే తక్షణ చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. నగరాలతో పాటు, సమీప ప్రాంతాల్లో ఉన్నచెరువులను కుంటలను ఆక్రమించుకున్న కారణంగా కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా వర్షాలతో హైదరాబాద్ నగరవాసులు వణికిపోయారు. ప్రకృతి విధ్వంసం వల్ల వాతావరణ విపరీత ధోరణులు కానవస్తున్నాయి.వరదలు పంటలను, ప్రజలను నష్టాలపాల్జేశాయి. ఖరీఫ్ సీజనులో వ్యవసాయం సాగేందుకు వీలుగా సమతుల్య వానలు పడాల్సి ఉండగా దేశంలో ఒక ప్రాంతంలో కరువు, మరో ప్రాంతంలో సాధారణ స్థాయి కంటే కొన్ని రెట్ల అధిక వర్షాలు పడటం పర్యావరణ సమస్య తీవ్రతకు సంకేతం. ఆంధ్రప్రదేశ్ లోనే చూసుకుంటే రాయలసీమ, నెల్లూరు తీవ్ర వర్షాభావం ఎదుర్కొంటున్నాయి. మహారాష్ట్రలోనూ అంతే విదర్భ ఇత్యాది ప్రాంతాల్లో అనావృష్టి తిష్ట వేయగా పలు జిల్లాల్లో నదులు పొంగి పొర్లుతూ నష్టాలు కలిగిస్తున్నాయి. భారీ వర్షాలు, వరదల వలన కలిగే నష్టాలు విషాదకరం. నదీ ప్రవాహాలను సమర్థవంతంగా నియంత్రించి నీటిని ఒడిసిపట్టే బదులు పర్యావరణ నిబంధనలను ప్రభుత్వమే ఉల్లంఘించి వరదనీటి ప్రవాహాలు అదుపు తప్పేందుకు కారణభూతమవుతోంది. దీర్ఘకాలంలో పర్యావరణానికి చేటు కలిగిస్తున్న మానవ తప్పిదాలు ఊహించని ఉత్పాతాలకు కారణం కావడం మిక్కిలి ఆందోళనకరం. పర్యావరణ, సంస్కృతి, జీవ వైవిధ్యాల పరంగా ప్రాశస్త్యం కలిగిన పశ్చిమ కనుమలు రానురాను ప్రమాద భరితంగా తయారవడానికి దోపిడీతో కూడిన మానవ తప్పిదాలే కారణమని పర్యావరణవేత్తలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నారు. గనుల,క్వారీల తవ్వకాలు,అడవుల విధ్వంసం, పట్టణీకరణ, అటవీ భూములను అటవేతర పనులకు మార్పు చేయడం, నదులు, నదీ ప్రవాహ ప్రాంతాలకు అడ్డంగా పక్కా నిర్మాణాల వంటివి పశ్చిమ కనుమలను విధ్వంసం చేస్తున్నాయి. కేరళ, తమిళనాడు, గోవా, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ పశ్చిమ కనుమల్లో భాగం. గతేడాది నాటి కేరళ మహోగ్ర వరదలతో సహా ప్రస్తుత జలవిపత్తుల వరకు అన్నీ పడమటి కనుమల్లోనే సంభవిస్తుండటాన్ని బట్టి చూస్తే పర్యావరణవేత్తల ఆందోళనలు వాస్తవిక రూపం దాల్చుతున్నాయని భావించాల్సి ఉంటుంది. 2013లో ఉత్తరాఖండ్‌ను అకస్మిక వరదలు ముంచెత్తినప్పుడు నదులపై ఇబ్బడిముబ్బడిగా నెలకొల్పిన జల విద్యుత్ ప్రాజెక్టులు నదుల ప్రవాహాన్ని ఆటంక పర్చి చుట్టుపక్కనున్న ప్రాంతాలను ముంచెత్తాయని కనుగొన్నారు. కానీ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. మళ్లీ ఎప్పుడైనా వరదలొచ్చినప్పుడు మాత్రమే అలాంటి అక్రమాలు చర్చకొస్తాయి. ప్రభుత్వాలకు ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం అబ్బినందున ప్రజలకు కష్టనష్టాలు తప్పట్లేదు. మొత్తంగా వరదలకు దేశంలోని దక్షిణ, పశ్చిమ ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలు, వరదల ఉధృతికి కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్,బీహార్‌లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అత్యధిక వర్షపాతం

నమోదయినా నీటి సంరక్షణపై పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడంతో పాటు, అమలు చేయాలన్న లక్ష్యం కానరావడం లేదు. దీనికితోడు ఇటీవల వరదలు దేశవ్యాప్తగా అతలాకుతలం చేశాయి. అయినా తుఫాన్ల కారణంగా పలు ప్రాంతాల్లో కుండపోత వాన కురిసిందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. భారీవర్షానికి వరంగల్ లాంటి నగరంలో రహదారులు చెరువులను తలపించాయి. రోడ్లపై భారీగా వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడడం ఇప్పుడు పట్టణవాసులకు షరా మామూలయ్యింది. నైరుతికి తోడు ఉపరితల ఆవర్తనం కారణంగా దేశవ్యాప్తంగా జోరు వానలు పడుతు న్నాయి. లక్షలాది ఎకరాల్లో పంటలకు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు అపార నష్టం వాటిల్లింది. ఆర్థిక నగరం ముంబయి ముంపునకు గురైంది. ఉత్తరాఖండ్‌లో నదులు పొంగి పొర్లాయి. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వానలకు గోదావరి ఉప్పొంగి మన దగ్గర ఉభయ గోదావరి జిల్లాల్లోని లంక, ఏజెన్సీ గ్రామాలు వారం రోజులుగా నీటి ముంపునకు గురయ్యాయి. లంకగ్రామాలు ఇంకా నీటి నుంచి తేరుకోలేదు. గోదావరి వరదలతో వందలాది లంక గ్రామలు విలవిల్లాడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా నీరు చేరడంతో ఇళ్లు వదిలి బలవంతంగా బయటకు రావాల్సి వచ్చింది. దీంతో ప్రజలు పునరావాస కేంద్రాల్లో తలదాచు కుంటున్నారు. వరంగల్ తదితర జిల్లాల్లో కన్నా హీనంగా లంక గ్రామాలు విల్లవిల్లాడుతున్నారు. నీటినుంచి బయటపలేక ఉన్న వారిని ఆదుకునే వారు రాక ఆందోళన చెందుతున్నారు. నష్ట నివారణకు తక్షణ కార్యాచరణ చేపట్టాల్సి ఉన్నా వారిని పలకరించే నాధుడు లేకుండా పోయాడు. వరదతో వేలాది ఇళ్లల్లోకి నీరు వచ్చేయడంతో సమస్తం కొట్టుకుపోయాయి. ఇళ్లల్లో నిల్వచేసుకున్నవన్నీ నీటి పాలయ్యాయి. దుస్తులు, వంట పాత్రలు, ఆస్తిపత్రాలు... ఇలా అన్నీ కొట్టుకుపోయాయి. వరద ప్రవాహానికి చాలా వరకు పాడిపశువులు కొట్టుకుపోయాయి. ఇవన్నీ పర్యావరణ విధ్వంసానికి కారణంగా చూడాలి. వీటిని నిరోధించేలా మన కార్యాచరణ ఉంటే తప్ప భవిష్యత్ ఉత్పాతాలను తట్టుకోలేమని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

## ఆడబిడ్డలపై అత్యాచారాలకు అంతం లేదు

### –తెలంగాణ పాలకుల తీరుపై మండిపడ్డ విజయశాంతి

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఆడబిడ్డలపై జరుగుతున్న అన్యాయంపై ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్‌పర్సన్ విజయశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లో యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడం మనసును కలచివేసిందని ఆవేదన చెందారు. మహిళల రక్షణ పట్ల తెలంగాణ పాలకుల మాటలు నీటి మీద రాతలే అని విజయశాంతి వ్యాఖ్యానించారు. ఫేస్‌బుక్ వేదికగా స్పందిస్తూ....నా తెలంగాణలోని ఆడబిడ్డలపై కొందరు ఇంతటి హేయమైన నేరాలకు పాల్పడటం తల తీసుకోవాలనే ఆక్రోశాన్ని కల్పిస్తోందన్నారు. ఏడాది కిందట జరిగిన దిశ ఘటన చేసిన గాయాలు ఇంకా ఆరకముందే... నిజామాబాద్‌లో మరో యువతిపై కొంతమంది సామూహిక అత్యాచారానికి పాల్పడటం మనసును కలచివేస్తోంది. సాక్షాత్తూ జిల్లా పరిపాలనా యంత్రాంగం కొలువై ఉండే కలెక్టరేట్‌కు సమీపాన ఈ దారుణం జరిగింది. గతంలో ఇటువంటి దారుణాలు జరిగినప్పుడు, మహిళా రక్షణకు అంత చేస్తాం... ఇంత చేస్తామంటూ తెలంగాణ పాలకులు చెప్పిన కబుర్ల నీటిమీద రాతలేనని తేలిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అమీన్‌పూర్ ఆశ్రమంలో అనాథ బాలిక మృతి ఘటన కలకలం రేపుతూనే ఉంది. ఎన్‌కౌంటర్లు సమర్థనీయం కానప్పటికీ, దిశ ఘటనలో నిందితులు తూటాలకు నేలకొరిగినా... పోలీసులంటే ఏ మాత్రం భయంలేని రీతిలో... మహిళా రక్షణ చట్టాలంటే ఏమాత్రం లెక్కలేనితనంతో కామాంధులు చెలరేగిపోతున్నారంటే... తెలంగాణలో ఆ చట్టాల అమలు ప్రభావం ఎంత గొప్పగా ఉందో అర్థమవుతూనే ఉంది. తెలంగాణలోని ఈ పరిస్థితులు రాష్ట్రంలోని మహిళలందరినీ తీవ్ర అభద్రతా భావంలోకి నెడుతున్నాయనే వాస్తవాన్ని కేసీఆర్ దొరగారు ఇప్పటికైనా గ్రహించాలి అంటూ విజయశాంతి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## కరోనా కట్టడికి ర్యాపిడ్ టెస్టులు

జనగామ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడికి జిల్లాలో కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ నిఖిల తెలిపారు.ర్యాపిడ్ కిట్ల ద్వారా అరగంటలో ఫలితాలు వస్తాయని, కరోనా పాజిటివ్ వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారులు వివరిస్తారని కలెక్టర్ తెలిపారు. టెస్టుల సంఖ్యను భారీగా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లాలో ప్రతి రోజూ 1150 మందికి టెస్ట్‌లు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ నిఖిల తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 50, ప్రాంతీయ దవాఖానలో 100, జిల్లా దవాఖానలో 200 టెస్టులు చేసేలా ఏర్పాట్లు చేశామని ఆమె పేర్కొన్నారు. దీంతో కరోనా టెస్టులు చేయించుకునేవారు గంటల తరబడి వేచిచూడాల్సిన అవసరం ఉండదని నిఖిల తెలిపారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా టెస్టులు చేస్తారని, ఎక్కువ టెస్టులు చేయడం ద్వారా కరోనా రోగులను గుర్తించి వారికి చికిత్స అందించేందుకు అవకాశముంటుందని వెల్లడించారు. పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారిలో శ్వాస సంబంధిత ఇబ్బందులు ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారిని జనగామ ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేస్తామని తెలిపారు. కరోనా లక్షణాలున్నవారు ఆందోళన చెందకుండా స్వచ్ఛందంగా వచ్చి టెస్ట్‌లు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ప్రకృతి వనాలు త్వరగా పూర్తి చేయాలి

నిర్మల్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ):జిల్లాలో పల్లె ప్రగతిలో భాగంగా నిర్మిస్తున్న సెగ్రిగేషన్ షెడ్లు, ప్రకృతివనాలను వేగంగా చేపట్టాలని కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూ ఖీ అధికారులను ఆదేశించారు. మండలస్థాయి అధికారులు నిత్యం ఈ పనులను పర్యవేక్షించాలని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్డు పురోగతిని కలెక్టర్ కార్యాలయానికి వీడియో కాల్స్ ద్వా రా అందించాలని సూచించారు. ప్రకృతి వనాలను కూడా ఈనెల 31 లోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చెరువుల శిఖం భూములు ఆక్రమించేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలనిఅధికారులను ఆదేశించారు. శిఖం భూములు ఆక్రమణకు గురి కాకుండా సరిహద్దులు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఉన్న చెరువులు, శిఖం భూములు, ఆక్రమణకు గురైన భూములు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.రెవెన్యూ రి కార్డు, ల్యాండ్ రికార్డు సర్వే సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు.

## సిల్క్ చీరల దొంగను పట్టేసిన పోలీసులు

చెన్నై,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): సిల్క్ చీరలను దొంగిలించిన ఐదుగురు వ్యక్తుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోలాథూర్‌కు చెందిన పి. ప్రభు అనే వ్యక్తి పట్టు చీరల వ్యాపారం చేస్తుంటాడు. పాత లక్ష్మీపురంలోని ఓ గోదాంలో చీరలను స్టాక్ చేశాడు. ఈ నెల 17న గోదాంకు లాక్ చేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూసే సరికి షాక్‌కు గురయ్యాడు. గోదాంలోని పట్టు చీరలన్ని చోరీకి గురయ్యాయి. అపహరణకు గురైన చీరల విలువ దాదాపు రూ. 15 లక్షలకు పైగానే ఉంటుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పూజల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ పరిశీలన అనంతరం ఓ అనుమానితుడిని గుర్తించారు. నిందితుడిని అదే గోదాంలో పనిచేసే పి. విగ్నేశ్‌గా గుర్తించారు. తన సహచరులతో కలిసి చోరీకి పాల్పడ్డాడు. నిందితుల వద్ద నుంచి 321 పట్టు చీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## ఆసుపత్రుల బాట పట్టిన కాంగ్రెస్

### –కరోనా చికిత్సల్లో ప్రభుత్వం విఫలం: భట్టి

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ నేతలు ఆసుపత్రుల బాట పట్టారు. భద్రాచలం ప్రాంతీయ ఆసుపత్రిని బుధవారం కాంగ్రెస్ శాసన సభాపక్షం పరిశీలించింది. సీఎల్పీ నాయకుడు మల్లు భట్టివిక్రమార్క, ములుగు ఎమ్మెల్యే సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య నేతృత్వంలోని బృందం ఆసుపత్రికి చేరుకుని రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కొవిడ్ రోగులకు చేస్తున్న పరీక్షలు, చికిత్సలకు సంబంధించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యుగేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆసుపత్రుల్లో సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కానికి కృషి చేసేందుకే ఈ యాత్ర చేపట్టినట్లు సీఎల్పీ బృందం స్పష్టం చేసింది. 11 రోజులపాటు జరిగే ఈ పర్యటన సెప్టెంబరు 5న హైదరాబాద్‌లోని ఆస్పత్రుల పరిశీలనతో ముగియనుంది. భద్రాచలం పర్యటన తర్వాత ఇవాళ ములుగు జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులను సీఎల్పీ బృందం పరిశీలించనుంది.

# రాష్ట్ర కాంగ్రెస్‌పై ఎఐసిసి పరిణామాల ప్రభావం

### పిసిసి చీఫ్ మార్పు ఇప్పట్లో ఉండదన్న సంకేతాలు
### మరో ఆరు నెలల పాటు ఉత్తమ్ కొనసాగుతారన్న చర్చ

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్‌లో ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా కార్యక్రమాలు సాగిస్తున్నారు. అలాగే ఒకరిపై ఒకరికి పడదని ముందు నుంచి అందరికి తెలిసందే. దీనికితోడు పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ అంటే గిట్టని వారే పార్టీలో ఎక్కువగా ఉన్నారు. ఈ పదవిపై ఆశ పెట్టుకున్న వారు గతేడాదిగా చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్నారు. అయితే ఎఐసిసి పరిణామాల నేపథ్యంలో మరో ఆరు నెలల వరకు పిసిసి మార్పు ఉండదన్న సంకేతాలు వస్తున్నాయి. ఉత్తమ్ స్థానంలో తామే రైట్ అంటూ చాలామంది గతంలో ఎవరికి వారు ప్రయత్నాలు చేశారు. తాజాగా కరోనా నేపథ్యంలో కాంగ్రెస్ పోరాడుతు న్నా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేంతగా ఫలితాలు రాబట్టలేకపోతున్నారు. కేవలం కాంగ్రెస్ విమర్శలకే పరిమితం కావడంతో అనేక కార్యక్రమాలు ఫ్లాప్ అయ్యాయి. ఇవన్నీ నాయకత్వ సమస్యగా పార్టీ నేతలు చూపిస్తున్నారు. మొత్తంగా ఇటీవలి ఢిల్లీ పరిణామాల నేపథ్యంలో పిసిసి చీఫ్ మారడం అన్నది ఇప్పట్లో జరగదని తెలుస్తోంది. ఎఐసిసి కొత్త అధ్యక్షుడి ఎంపిక జరిగే వరకు ఉత్తమ్ కొనసాగుతారిన పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. దీంతోతెలంగాణ పిసిసి చీఫ్ మార్పు ముహూర్తం కుదరడం లేదని కూడా వ్యాఖ్యానిస్తు న్నారు. దీంతో ఆశావహులకు నిరాశే ఎదురౌతోంది. ఏడాది కాలంగా తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడి మార్పు ఖాయమనే ప్రచారం నడుస్తున్నా... ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటారనుకుంటే... అదీ జరగలేదు. అధ్యక్ష బాధ్యతల్ని రాహుల్ గాంధీ చేపడతారని... వెంటనే టీ-పీసీసీకి కొత్త నాయకుడ్ని నియమిస్తారని ఓ వర్గం భావించింది. కానీ... వర్కింగ్ కమిటీ సమావేశంలో గందరగోళంతో అధ్యక్ష పదవిలో మరో ఆరు నెలల పాటు కొనసాగేందుకు సోనియా గాంధీ అంగీకరించడంతో తెలంగాణ పిసిసి కూడా వాయిదా పడినట్లేనని భావిస్తున్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో చాలా కాలంగా కొనసాగుతున్నాం కనుక తమకేనంటూ చెప్పుకున్నారు కొందరు నేతలు. మరో ఆరు నెలల పాటు తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉత్తమ్ కొనసాగే అవకాశాలన్నాయన చర్చ జరుగుతోంది. మరోవైపు... గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు... ఖమ్మం, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉన్నాయి. ఈ ఎన్నికలు పూర్తయ్యే వరకు మార్పులు, చేర్పులు ఉండకపోవచ్చనే చర్చ నడుస్తోంది. పార్టీ అధ్యక్షురాలిగా సోనియాగాంధీ కొనసాగినంత కాలం... ఉత్తమ్‌కి ఢోకా లేదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయితే... ఉత్తమ్ వ్యతిరేక శిబిరం మాత్రం... ఇప్పటికీ మార్పుపై ఆశలు వదులుకోడానికి సిద్ధంగా లేదు. తెలంగాణలో ప్రభుత్వంపై పోరాడేందుకు గట్టి నాయకుడు అవసరం అన్న భావనలో పలువురు ఉన్నారు.

# టిఆర్ఎస్‌లో నివురుగప్పిన అసమ్మతి

### పదవుల కోసం సీనియర్ల ఎదురుచూపు
### స్వామిగౌడ్ వ్యాఖ్యలపై రాజకీయ చర్చ

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): అధికార టిఆర్ఎస్‌లో అసమ్మతి నివురుగప్పిన నిప్పులా రాజ్యమేలు తోంది. చాలామంది తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారు ఇప్పుడు సైలెంట్ అయ్యారు. అలాగే అనేకమంది సీనియర్లను సిఎం కెసిఆర్ పక్కన పెట్టారు. మాజీ స్పీకర్ మధుసూధనాచారి, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, డాక్టర్ వేణుగోపాలాచారి, నాయిని నర్సింహారెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు వంటి నేతలంతా ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. ఎమ్మెల్సీ, రాజ్యసభ వంటి పదవుల చర్చ సందర్భగానూ వీరి పేర్లు ప్రస్తావనకు రావడం లేదు. కొందరు అప్పుడప్పుడూ కనిపిస్తున్నా ఎక్కడా చురుకుగా పాల్గొనడం లేదు. అధినేతను కలవాలన్న అవకాశం రావడం లేదన్న ఆందోళనలో ఉన్నారు. మధుసూధనాచారి సిఎంకు అత్యంత దగ్గరగా ఉన్నా ప్రస్తుతం ఆయన ఎక్కడా కనిపించడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగానూ ఆయన పేరు రావడం లేదు. ఇక ఇటీవల స్వామిగౌడ్ ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్యలు పార్టీలో ఉన్న అసమ్మతి గళానికి కేంద్రంగా చూడాలి. ఒక్క స్వామిగౌడ్ మాత్రమే గళం విప్పారు. అనేకులు ఇప్పుడు అదే అభిప్రాయంతో ఉన్నారని తెలుస్తోంది. స్వామిగౌడ్ తెలంగాణ ఉద్యమసమయంలో ఉద్యోగ సంఘాల పోరాటంలో అగ్రభాగంలో ఉన్నారు. నాడు జేఏసీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. 2012 జులైలో పదవి విరమణ చేసిన తర్వాత టిఆర్ఎస్ ద్వారా రాజకీయ అరంగేట్రం చేశారు. 2013 ఫిబ్రవరిలో కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి పోటి చేసి గెలిచారు. ఆపై తెలంగాణ ఏర్పాటు కావడం.. టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో.. తెలంగాణ శాసనమండలికి తొలి చైర్మన్ అయ్యారు. ఆ తరవాత రాజేంద్రనగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీకి ఆసక్తి చూపినా అవకాశం రాలేదు. చేవెళ్ల ఎంపీ టికెట్ అడిగినా నిరాశే ఎదురయ్యింది. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేసిన స్వామిగౌడ్ మండలి చైర్మన్ అయ్యాక నోరు లఃకట్టేసుకోవాల్సి వచ్చింది. ఇదే అభిప్రాయాన్ని పలు సందర్భాలలో ఆయన సన్నిహితుల దగ్గర చెప్పేవారు. 2018 అసెంబ్లీ ముందస్తు ఎన్నికల్లో రాజేంద్రనగర్ నుంచి పోటీ చేయడానికి ఆసక్తి ప్రదర్శించినా ఆయనకు నిరాశే ఎదురైంది. ప్రస్తుతం స్వామిగౌడ్ రాజకీయంగా ఖాళీగా ఉన్నారు. 2019 మార్చిలోనే ఆయన ఎమ్మెల్సీ పదవీ కాలం ముగిసిపోయింది. అసెంబ్లీ టికెట్ ఇవ్వకపోయినా.. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశించి.. చేవెళ్ల టికెట్ అడిగారు. అప్పుడు కూడా పార్టీ నుంచి సానుకూల స్పందన రాలేదు. అప్పటి నుంచి మౌనంగా ఉండిపోయిన స్వామిగౌడ్.. ఎక్కడా పెదవి విప్పింది లేదు. టీఎన్‌జీవో ప్రెసిడెంట్‌గా స్వామిగౌడ్ ఉన్న సమయంలో ఉద్యోగులకు ఇళ్ల స్థలాల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై అప్పట్లో విచారణ కూడా జరిగింది. ఎమ్మెల్సీగా పదవీ కాలం ముగిసిన తర్వాత మళ్లీ చట్ట సభలో అడుగుపెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించినా కెసిఆర్ అవకావం ఇవ్వలేదు. సీఎం కేసీఆర్‌ను కలిసే ప్రయత్నం చేసినా సక్సెస్ కాలేకపోయారన్న ప్రచారం ఉంది. మంత్రి కేటీఆర్‌ను మాత్రం కలిసి తన మనసులో మాట చెప్పారని స్వామిగౌడ్ అనుచరులు అంటున్నారు.

చేతిలో పదవి లేకపోవడం.. తనను ఎవరూ పట్టించుకోకపోవడంతో టీఆర్ఎస్‌లో తనకు భవిష్యత్ లేదనే నిర్ధారణకు స్వామిగౌడ్ వచ్చినట్లు చెబుతున్నారు. ఇటీవల ఆయన చేసిన కామెంట్స్ దీనికి బలం చేకూరుస్తున్నాయి. నారాయణగురు జయంతి వేడుకల్లో పాల్గొన్న స్వామిగౌడ్.. దేశంలో కొన్ని కులాలే పరిపాలిస్తున్నాయని.. ప్రజాస్వామ్యాన్ని నడిపిస్తున్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలే తెలంగాణ రాజకీయవర్గాల్లో ఇప్పుడు చర్చకు దారితీస్తున్నాయి. స్వామిగౌడ్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయంలో అదే వేదికపై టీఆర్ఎస్ మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కూడా ఉన్నారు. అది కాక సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ నేపథ్యంలో టీఆర్ఎస్ శ్రేణులు శత్రువుగా భావించే రేవంత్ రెడ్డిని పొగడడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఓ సదంర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ స్వామిగౌడ్ వ్యాఖ్యలను కొట్టి పారేశారు. ఆయన వ్యక్తిగతమన్నారు. రేవంత్‌ను పొగడం తప్పని అన్నారు. అయితే స్వామిగౌడ్ వ్ఆయఖ్యలపై ఎక్కడా పెద్దగా స్పందన రాకుండా టిఆర్ఎస్ జాగ్రత్త పడింది. ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనే అవకాశం రాకపోగా.. శాసనమండలిలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాల్లో తన పేరు పరిశీలనలో లేదన్న సంకేతాలు.. స్వామిగౌడ్ అలా మాట్లాడటానికి కారణమై ఉండొచ్చన్నది రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. . మొత్తానికి తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు సన్నిహితంగా ఉన్న స్వామిగౌడ్.. ఇప్పుడిలా సంచలన వ్యాఖ్యలు చేయడం ద్వారా పార్టీకి ఎటువంటి సంకేతాలు పంపాలనుకుంటున్నారో తెలియాల్సి ఉంది. పార్టీలో ఈ విధంగా బీసీ వాయిస్ వినిపించడం ఇది కొత్త కాదు. గతంలో మంత్రి ఈటల రాజేందర్ కూడా మాట్లాడారు. కాకపోతే.. స్వామిగౌడ్ స్పందించిన తీరు.. సమయం ప్రస్తుతం ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టీఆర్ఎస్‌లో తనకు అవకాశాలు రాకపోవచ్చునని భావించే.. రాజకీయ భవిష్యత్ దిశగా స్వామిగౌడ్ అడుగులు వేస్తున్నారని.. అందుకే ఈ స్థాయిలో బయటపడ్డారని అనుకుంటున్నారు. ఈ కోవలోనే ఆలోచన చేస్తున్న వారిలో చాలామంది ఉన్నారు. మధుసూధనాచారి, వేణుగోపాలాచారి, తుమ్మల నాగేశ్వర రావు లాంటి వారు ఇంకా పెదవివిప్పడం లేదు. అలాగే విప్పినా లాభం లేదని అంటున్నారు. మరి పార్టీ వీరికి ఎలాంటి అవకాశం కల్పిస్తుందో చూడాలి.

# పర్యాటకులకు దూరంగా సాగర్ జలాశయం

### ఆంక్షలతో అందాలు తిలకించలేకపోతున్న ప్రజలు

నల్లగొండ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో గా కొనసాగుతుండగా ప్రాజెక్టు నిండుకుండలా దర్శనిమిస్తోంది. చాలాకాలం తరవాత మళ్లీజలకళ సంతరించడంతో పర్యాటకులు ఆసక్తి చూపుతున్నా ఆంక్షలతో ఎవరూ రాలేకపోతున్నారు. కరోనాతో ఆంక్షలు అమలవుతున్నాయి. దీంతో పర్యాటకులను అనుమతించడం లేదు. గతంలో నిత్యం ఇక్కడికి సందర్శకులు భారీగా తరలి వచ్చేవారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా నిండుకుండను తలపిస్తోంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు దాదాపు పూర్తిస్థాయిలో నిండడంతో తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. కృష్ణా పరివాహక ప్రాజెక్టులు అన్ని నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయన్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ గరిష్ట స్థాయికి చేరినందున ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరందించే అవకాశం ఉంది. సాగర్ నిండడంతో రిజర్వాయర్ పరిధిలో మత్స్యకార్మిక కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రిజర్వాయర్‌లోకి సమృద్ధిగా వచ్చి చేరిన కృష్ణమ్మ చూసి సంబర పడుతున్నారు. సాగర్ లోతట్టు ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకున్న గంగపుత్రులతో పాటు, చేపల వృత్తే జీవనాధారంగా మత్స్యకారులు ఉత్సాహంగా చేపల వేటకు ఉపక్రమిస్తున్నారు. కుటుంబ సభ్యులంతా ఇదే వృత్తిపై ఆధారపడి ఆదాయం పొందుతారు. లోతట్టు ప్రాంతం వెంట జీవనం సాగిస్తున్న గిరిజనం సైతం చాలావరకు చేపల వేటను వృత్తిగా చేసుకుని బతుకుదెరువును సాగిస్తున్నది. సాగర్ నిండటంతో గిరిజనులకు సైతం ఉపాధి మెండుగా కలుగుతున్నది. కృష్ణా నదిలో మత్స్యకారులు ఏడాదిలో 300 రోజులపాటు చేపల వేటను కొనసాగిస్తారు. గతకొంతకాలం చేపలవేటకు దూరమైన మత్స్యకారులు రిజర్వాయర్‌లోకి భారీగా వచ్చిన నీటితో తిరిగి చేపల వేటకు సన్నద్ధం అవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం గతేడాది రిజర్వాయర్‌లోకి భారీగా చేప పిల్లలను వదలడం.. అవి పెరిగి పెద్దవ్వడంతో వలలో పడ్డ ఒక్కో చేప 20కిలోల వరకు ఉండి పుష్కలంగా ఆదాయం వస్తుందని వారు చెబుతున్నారు. చేపల బరువును బట్టి కిలోకు రూ.40 నుంచి రూ.100 వరకు దళారులు మత్స్యకారులకు చెల్లిస్తున్నారు.

## జమ్మికుంట ఆస్పత్రిని సందర్శించిన సిఎల్పీ

### –కరోనా కట్టడిలో సర్కార్ విఫలమైందన్న భట్టి

కరీంనగర్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): వైద్యశాఖ మంత్రి ఈటెల రాజేందర్ ఇలాఖాలోనే కరోనా కంట్రోల్‌కు సరైన చికిత్సలు అందడం లేదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. ఇక్కడే ఇలా ఉంటే రాష్ట్రంలో ఇంకెలా ఉందో వేరే చెప్పకర్లేదన్నారు. సీఎల్పీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ ఆస్పత్రుల సందర్శన కార్యక్రమాన్ని బుధవారం భద్రాచలం ఏరియా ఆస్పత్రి నుంచి ప్రారంభించారు. గురువారం కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రిని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తదితరులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిండెంట్ అనితారెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాగా అధికారుల తీరుపై భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో 30 పడకలే ఉంటే ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. జ్వరం, దగ్గు టాబ్లెట్స్‌తో కోవిడ్ నయం అవుతుందా అని నిలదీశారు. ప్రైవేటు ఆసుపత్రిలో ఇటీవల విడుదల అయిన కోవిడ్ మాత్రలు, ఇంజక్షన్లు ఇస్తుంటే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటెల రాజేందర్ ఇలాకాలో మాత్రం ఎర్రగోళీలు, పచ్చగోలిలు ఇస్తే ఎలా అంటూ భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని భట్టివిక్రమార్క విమర్శించారు. బాధితులకు వైద్య సేవలు అందించే విషయంలో సీఎం కేసీఆర్ చేతులెత్తేశారని అన్నారు. కరోనా బారిన పడిన వారు ఉంటే ఉంటారు.. పోతే పోతారు అన్న చందంగా సీఎం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వైరస్ వ్యాప్తిని అరికట్టే విషయంలో తాము పలు సూచనలు చేసినా.. ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా వైద్య పోస్టులను భర్తీ చేయకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఇలాంటి పరిస్థితిలో ప్రజలకు మెరుగైన వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించారు.

## దుబ్బాక ఉప ఎన్నికల్లో మేము సైతం

### –పోటీ చేస్తామని ప్రకటించిన కోదండరామ్

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికల్లో టీజేఎస్ పోటీ చేస్తోందని ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరాం ప్రకటించారు. ఉప ఎన్నికల్లో టీజేఎస్ ప్రభావం ఖచ్చితంగా ఉంటోందని తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే రామలింగారెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో దుబ్బాకలో ఉప ఎన్నిక అనివార్యం కానుంది. ఇక్కడి నుంచి పోటీ చేస్తామని కాంగ్రెస్ చీఫ్ ఉత్తమ్ కూడా ఇప్పటికే ప్రకటించారు. దీంతో ఇక్కడ బహుముఖ పోటీ తప్పేలా లేదు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి పదవిని వదులుకునే స్వభావం కేసీఆర్‌కు లేదని కోదండరామ్ అన్నారు. కొడుకు, కూతురు కంటే కేసీఆర్‌కు సీఎం పదవే ముఖ్యమని చెప్పారు. సిఎం పదవి వదులుకోవాలంటే కేంద్రంలో ఏదో ఓ పదవి కావాల్సి ఉందన్నారు. అందుకే కేంద్రంలో అవకాశం కోసం కేసీఆర్ ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కేటీఆర్ యాక్టివ్ సీఎంగా వ్యవహరిస్తున్నారనేది బహిరంగమేనన్నారు. అధికార వికేంద్రీకరణ రాష్ట్రానికి మంచిది కాదు.. ఎవరో ఒకరే సీఎంగా ఉండాలని సూచించారు. 1986 నుంచి ఉద్యమంలో ఉన్న స్వామిగౌడ్, దేవిప్రసాద్, దేశపతి శ్రీనివాస్, సిద్దారెడ్డిలకు అన్యాయం జరిగిందని చెప్పుకొచ్చారు. స్వామిగౌడ్‌కు మరోసారి ఎమ్మెల్సీగా అవకాశమివ్వాల్సిందే నన్నారు. అన్ని పక్షాలతో మాట్లడిన తర్వాతనే పట్టభద్రుల ఎమ్మెల్సీగా తాను పోటీచేసే అంశంపై నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు.

## రేషన్ దుకాణం ప్రారంభించిన మంత్రి కొప్పుల

జగిత్యాల,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): పేదలకు రేషన్ ఇవ్వడంతో పాటు, లాక్‌డౌన్ సమయంలో ఉచితంగా బియ్యం సరఫరా చేసిన ఘనత సిఎం కెసిఆదర్‌దని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లాలోని పెగడపల్లి మండలం నార్సింపేట గ్రామంలో గురువారం రేషన్ దుకాణాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న మంత్రికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన మంత్రి లబ్ధిదారులకు బియ్యాన్ని పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్రం దేశంలోనే ముందున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెట్పీటీసీ కాసుగంటి రాజేందర్ రావు, ఎంపీపీ గోలి శోభ, ఏఎంసీ చైర్మన్ తిరుపతి నాయక్, వైస్ చైర్మన్ రమణ, పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు లబ్ది చేకూరేలా చేపల పెంపకం

### –వెల్లడించిన మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

వికారాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): జిల్లాలో కోటి 11 లక్షల చేప పిల్లలు వదిలే కార్యక్రమం కొనసాగుతుందని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి గొట్టిముక్కుల గ్రామంలోని సర్పన్పల్లి ప్రాజెక్ట్ లో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ..మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. చెరువులు, ప్రాజెక్ట్ ల్లో ఉచితంగా నాణ్యమైన చేప పిల్లలు వదులుతున్నామని తెలిపారు. ముదిరాజ్, మృత్సకారులు ఆర్థికంగా లాభాలు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వారి సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి , ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, విద్యా, మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నాగేందర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, అడిషనల్ కలెక్టర్ లు మోతీలాల్, చంద్రయ్య పాల్గొన్నారు.

## రైతు వేదికలను సకాలంలో పూర్తి చేయాలి

మంచిర్యాల,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): రైతు వేదిక నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ భారతిహోళికెరి అన్నారు. రైతువేదికల నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నిర్మాణ పనుల్లో అవసరమైతే కూలీల సంఖ్య పెంచి త్వరగా పూర్తిచేయాలని, నిర్మాణాలకు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఎవరైనా స్వార్థ ప్రయోజనాల కోసం పనులకు ఆటంకం కలిగించినా, పనుల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు అలసత్వం, నిర్లక్ష్యం వహించినా కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతులను సంఘటితం చేస్తూ నియంత్రిత వ్యవసాయం ద్వారా మంచి లాభాలు సాధించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రైతు సమస్యలను చర్చిం చేందుకు వీలుగా ప్రతీ 5 వేల ఎకరాల క్లస్టర్‌లో రైతు వేదికల నిర్మాణం చేపట్టిందని తెలిపారు.

## దేశంలో పెరుగుతున్న రికవరీ రేటు

### -మరణాల శాతం కేవలం 1.84 మాత్రమే

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ):ప్రతిరోజు దేశంలో కరోనా వైరస్ నుంచి కోలుకుంటున్న వారి సంఖ్య పెరుగుతున్నది. గత కొన్ని రోజుల నుంచి ప్రతి రోజు సుమారు 60 వేల మంది వైరస్ నుంచి విముక్తుల వుతున్నారు. అయితే బుధవారం రికవరీలో కొత్త రికార్డు నమోదు అయ్యింది. యాక్టివ్ కేసుల కన్నా.. రికవరీ కేసులు 3.5 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. గడిచిన 24 గంటల్లో దేశంలో 63,173 మంది కోవిడ్ నుంచి కోలుకున్నారు. దీంతో దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 24,67,758కి చేరుకున్నది. దీంతో రికవరీ, పాజిటివ్ కేసుల మధ్య వ్యత్యాసం భారీగా పెరిగినట్లు స్పష్టమైంది. ఇప్పటి వరకు 17,60,489 మంది వైరస్ నుంచి రికవర్ అయ్యారు. అయితే ప్రస్తుతం మొత్తం 7,07,26 యాక్టివ్ కేసులు ఉన్నాయి. అంటే భారత్‌లో కోవిడ్ రికవరీ శాతం 76.30కి చేరినట్లు ఆరోగ్యశాఖ అధికారులు చెప్పారు. కోలుకున్నవారి శాతం రికార్డు స్థాయిలో ఉన్నందున.. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య కూడా తగ్గినట్లు తెలుస్తోంది. మొత్తం పాజిటివ్ కేసుల్లో.. కేవలం 21.87 కేసులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం టెస్టింగ్, ట్రేసింగ్ ప్రక్రియలను చేపట్టడం వల్ల దేశంలో కరోనా వైరస్ కేసుల సంఖ్య తక్కుముఖం పట్టింది. ప్రస్తుతం దేశంలో మరణాల శాతం కేవలం 1.84గా ఉన్నది. అది కూడా క్రమంగా తగ్గుతున్నట్లు ఆరోగ్యశాఖ అధికారులు చెప్పారు. దేశవ్యాప్తంగా కరోనా వైరస్ వ్యాప్తి అంతకంతకూ పెరుగుతూనే ఉంది. కొత్తగా 67,151 కరోనా పాజిటివ్ కేసులు నమోదవడంతో మొత్తం కేసుల సంఖ్య 32,34,475 చేరింది. గడిచిన 24 గంటల్లో 1059 మంది కరోనా బాధితులు మృతి చెందడంతో ఆ సంఖ్య 59,449 కు చేరింది. వైరస్‌బారిన పడ్డవారిలో ఇప్పటివరకు 24,67,759 మంది కోలుకున్నారు. భారత్‌లో ప్రస్తుతం 7,07,267 యాక్టివ్ కేసులున్నాయి. కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ ఈ మేరకు బుధవారం హెల్త్ బులెటిన్‌లో పేర్కొంది. కాగా, దేశంలో ఇప్పటివరకు 3.76 కోట్ల వైరస్ నిర్ధారణ పరీక్షలు చేశామని భారత్ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తెలిపింది.

## వచ్చే నెలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తిరుమల,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): వచ్చేనెలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. సెప్టెంబరు మాసంలో తిరుమలలో విశేష పర్వదినాలు నిర్వహించనున్నాయి. సెప్టెంబర్ 1న అనంత పద్మనాభ వ్రతం, 17న మహాలయ అమావాస్య ఉంది. 18వ తేదీన తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగనుంది. ఆ తర్వాతి రోజు అంటే సెప్టెంబరు 19న ధ్వజారోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 23న శ్రీవారి గరుడసేవ, 24న శ్రీవారి స్వర్ణ రథోత్సవం, 26న రథోత్సవం నిర్వహించనున్నారు. 27న శ్రీవారి చక్రస్నానం, ధ్వజారోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి. ఇక సెప్టెంబరు 28న శ్రీవారి బాగ్ సవారి ఉత్సవం జరుగుతుంది. ఇదిలావుంటే తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో ఈ నెల 28 శుక్రవారం నుండి 30వ తేదీ వరకు పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అంకురా ర్పణతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం పవిత్రప్రతిష్ఠ, సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 29న మూలవర్లకు, ఉత్సవర్లకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి, మాడ వీధుల్లోని శ్రీమఠం ఆంజనేయస్వామి వారికి పవిత్రాలు సమర్పించ నున్నారు. 30న పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. ఈ మూడు రోజుల పాటు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. కోవిడ్ 19 నిబంధనల మేరకు ఆలయంలో పవిత్రోత్సవాలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

## కౌలు రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం దారుణం

### వారికి వెంటనే చెల్లింపులు చేయాలి: సోము వీర్రాజు

అమరావతి,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): నవ్యాంధ్రప్రదేశ్‌కు రాజధానిగా అమరావతి నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులకు వార్షిక కౌలు చెల్లింపులో ప్రభుత్వం తీరు గర్హనీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు వ్యాఖ్యానించారు. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం భూమి ఇచ్చిన ప్రతి రైతుకీ సకాలంలో వార్షిక కౌలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.28 వేల మందికి పైగా రైతులు తమ భూములను రాజధాని కోసం ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం సీఆర్డీఏ రైతులతో చేసుకొన్న ఒప్పందం ఎకరాకీ ప్రతి ఏటా రూ.3 వేలు మెట్టకి, రూ.5 వేలు పెంచాల్సి ఉందన్నారు. కరోనా కష్ట సమయంలో సకాలంలో కౌలు చెల్లించి రైతులు ఆదుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రిని కోరారు. భారతీయ జనతా పార్టీ కూడా ప్రభుత్వానికి మానవీయ కోణంలో ఆలోచించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఒప్పందం ప్రకారం ఇచ్చిన సమయానికి మించి 100 రోజులు గడిచాయని అందువలన రైతులు రోడెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. న్యాయం కోసం వచ్చిన వారిపై నమోదు చేసిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని, ఇంకా ఎవరినైనా విడుదల చేయకపోతే వెంటనే విడుదల చెయ్యాలని ప్రభుత్వాన్ని కోరారు. జూన్ 21న కౌలు రైతులకు చెల్లించాల్సిన సొమ్ము విడుదల చేస్తున్నట్లు రెండు జీవోలను జారీ చేసినా ఏ రైతు ఖాతాలోకీ జమ కాలేదన్నారు. ఆ జీవోలు వచ్చి రెండు నెలలు దాటినా సాంకేతిక కారణాలు చూపిస్తూ ఆ సొమ్ము చెల్లించకపోవడం రైతులను క్షోభకు గురి చేయడమే అవుతుందని ఆయన మండిపడ్డారు. ఆ కౌలు మొత్తం అడిగేందుకు సి.ఆర్.డి.ఏ. కార్యాలయానికి వెళ్ళిన రైతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఖండిస్తున్నానన్నారు. భూములిచ్చిన రైతులతో చేసుకున్న ఒప్పందాన్ని గౌరవించి సత్వరమే పరిష్కార మార్గం చూడాలని ప్రభుత్వాన్ని సోము వీర్రాజు డిమాండ్ చేశారు.

## 1న వైఎస్సార్ పోషణ పథకం ప్రారంభం

అమరావతి,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): సెప్టెంబర్ 1న 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని' ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనురాధ తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రూ.1,863 కోట్లతో 30లక్షల మందికి పౌష్టికాహారం అందిస్తామని వెల్లడించారు. సెప్టెంబర్ నుంచి రేషన్‌ను ఇంటికే పంపిణీ చేస్తామని తెలిపారు. 50 శాతం మంది మహిళల్లో రక్త హీనత ఉందని.. గర్భిణీలు, మహిళలు, పిల్లల్లో రక్తహీనత నివారించేందుకే ఈ పథకాన్ని తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రీ ప్రైమరీ విద్యను ప్రవేశపెట్టబోతున్నామని.. 55 వేల అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ పిల్లలకు ప్రైవేట్ స్కూళ్ల తరహాలో విద్య అందిస్తామని అనురాధ పేర్కొన్నారు.

## రాజధాని తరలింపుపై 21 వరకు ఉత్కంఠ

### స్టేటస్‌కో విధించిన ఏపి హైకోర్టు

అమరావతి,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): రాజధాని తరలింపుపై మరోమారు ఉత్కంఠ కొనసాగనుంది. ఏపీలో రాజధాని తరలింపు, సీఆర్డీఏ చట్టం రద్దుపై స్టేటస్ కోను రాష్ట్ర హైకోర్టు మరోసారి పొడిగించింది. వచ్చే నెల 21 వరకు స్టేటస్ కో పొడిగిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈలోపు కౌంటర్లు దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఇదిలా ఉంటే రాజధాని పిటిషన్‌లపై రోజు విచారణ చేస్తామని హైకోర్టు తెలిపింది. మరోవైపు హైకోర్టు విధించిన స్టేటస్ కోను ఎత్తివేసేందుకు సుప్రీంకోర్టు కూడా నిరాకరించింది. కేసు ప్రాముఖ్యతను బట్టి హైకోర్టే చూసుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. సెప్టెంబర్ 21 నుంచి ప్రతి రోజు ఈ కేసును విచారణ చేస్తామని ఏపీ హైకోర్టు పేర్కొన్నది. గతంలో ఆగస్టు 14 వరకు ఆ తరువాత ఆగష్టు 27 వరకు రాజధాని బిల్స్ పై హైకోర్టు స్టేటస్ కో విధించిన సంగతి తెలిసిందే. భౌతిక దూరం పాటిస్తే హైకోర్టులోనే విచారణ జరిపేందుకు సిద్ధమని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. రాజధాని, సీఆర్డీఏ చట్టం రద్దుపై గతంలో హైకోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఉత్తర్వులు గురువారంతో ముగిశాయి. దీంతో సెప్టెంబరు 21 వరకు స్టేటస్‌కో అమలు గడువును పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రాజధాని బిల్లులు అమలు చేయకుండా స్టేటస్ కో కొనసాగుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణ సెప్టెంబరు 21కి వాయిదా వేసింది. దీనిపై ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు కూడా వెళ్ళింది. అయితే, స్టేటస్ కో పై మధ్యంత ఉత్తర్వులు ఇవ్వలేమని, ఏపీ హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొన్నది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నితీశ్ గుప్తా కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. విశాఖలోని కాపులుప్పాడలో రాష్ట్ర ప్రభుత్వం భారీ అతిథిగృహాన్ని నిర్మించ తలపెట్టిందని, స్టేటస్ కో అమల్లో ఉన్నప్పుడు అతిథిగృహం నిర్మాణానికి శంకుస్థాపన ఏంటని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

# సంక్షేమ పథకాలే తెలంగాణ స్పెషల్

### అభివృద్ధిలో మనమే ముందున్నాం: ఆరూరి రమేశ్

వరంగల్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): వర్ధన్నపేట నియోజవర్గం అభివృద్ధికి అనేక కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అండదండలతో అభివృద్ధిలో ముందున్నామని చెప్పారు. ప్రధాన సమస్యలను కేసీఆర్ ,కేటీఆర్ దృష్టికి తీసుకెళ్ళి మాట్లాడుతనని తెలిపారు. గత ఎన్నో ఎండ్లా పాటు అనేక రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నా,ఎవరు కూడా కులవృత్తులకు పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 200 ,వికలాంగులు500 పెన్షన్ లు ఉండేవి కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 1000,1500 లకు పెంచారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వని అనేక సంక్షేమ పథకాలు కల్యాణ లక్ష్మి,షాది ముబారక్ ,చెక్కుల పంపిణీ చేస్తుంది. గతంలో పాలించిన కాంగ్రెస్ పార్టీ కి సోయ్ ఉందా అని అన్నారు..రెక్కాడితే కాని డొక్కాడని నిత్యం పని చేసుకొని వారి కోసం అనేక పథకాలు అందిస్తుంది.కేసీఆర్ కిట్ లతో పాటు ఉచిత డెలివరీ,డబ్బులు కూడా ఇస్తున్న ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వం అని తెలిపారు. ప్రతి పేద విద్యార్థుల కోసం అనేక గురుకుల పాటశాల ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య,సన్నబియ్యం పెడుతున్న ప్రభుత్వం తమదని అన్నారు. ప్రతి ఇంటికి గోదావరి నీళ్లను అందించేందుకు మిషన్ భగీరథ కార్యక్రమం చేస్తుంది.

సుమారు 415 సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత కేసీఆర్‌దని అన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఉచిత విద్యుత్ 24 గంటల పాటు ఇస్తున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని అంతే కాక బ్యాంక్ రుణమాఫీ ,పెట్టుబడి కోసం పెట్టుబడి చెక్కుల పంపిణీతో పాటు రైతులు ప్రమాదాలు జరుగుతే 5లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అన్నారు. అన్ని గ్రామాల్లో అంతర్గత సిసి రోడ్లను నిర్మించామని అన్నారు. అభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతుంటే కాంగ్రెస్ విమర్శల్లో ముందన్నదని ఎద్దేవా చేశారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి పనులను గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. ప్రతి గ్రా మంలోనూ తెలంగాణ సర్కారుకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని చెప్పారు. ఈ ఆరేళ్ల పాలనలో ప్రజల ఆదరాభిమానాలు ప్రభుత్వంపై మరింత బాధ్యతను పెంచాయని పేర్కొన్నారు. ముఖ్యంగా సర్కారు అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా పథకాలను రూపొందించిందని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపరిచేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి నట్లు చెప్పారు. బంగారు తెలంగాణ దిశగా చేపడుతున్న అభివృద్ధి పనులపై గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, ప్రజలకు అవగాహన కల్పించాలని వివరించారు.

# సిబిఐకి సుశాంత్ సింగ్ మృతి కేసు

### వివరాలను ముంబై పోలీసులు సిబిఐకి అప్పగించాలి
### పాట్నాలో ఎఫ్ఐఆర్ నమోదును సమర్థింపు
### సుశాంత్ మృతి కేసులో సుప్రీం సంచలన ఆదేశాలు

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): బాలీవుడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మృతి కేసును సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించింది. ఈ కేసులో మహారాష్ట్ర పోలీసులు సీబీఐకి సహకరించాలంటూ బుధవారం అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఇప్పటి వరకు ఈ కేసులో విచారణ నిర్వహించిన ముంబై పోలీసులు తమ దగ్గర ఉన్న అన్న వివరాలను సీబీఐకి అప్పగించాలని కోర్టు ఆదేశించింది. రియాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం న్యాయబద్ధమైనదే అంటూ సుప్రీం పేర్కొన్నది. ఈ కేసులో సింగిల్ బెంచ్ జస్టిస్ హృషికేశ్ రాయ్ తీర్పును ఇచ్చారు. రాజ్‌పుత్ మరణం కేసులో భవిష్యత్తులో ఎటువంటి కేసు నమోదు అయినా.. వాటిని కూడా సీబీఐ చూసుకోవాలని కోర్టు ఆదేశించింది. ముంబై, బీహార్ పోలీసుల మధ్య ఉన్న పెనుగులాటను పక్కనపెట్టిన కోర్టు.. పాట్నాలో ఎఫ్ఐఆర్ నమోదు కావడం న్యాయబద్ధమే అంటూ కోర్టు చెప్పింది. తీర్పు తర్వాత మహారాష్ట్ర అప్పీల్‌కు వెళ్లే ప్రయత్నం చేసింది.. కానీ కోర్టు దాన్ని కొట్టివేసింది. సుప్రీం ఇచ్చిన తీర్పును సుశాంత్ సోదరి శ్వేతా సింగ్ స్వాగతించింది. బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కూడా సుప్రీం తీర్పును స్వాగతించారు. సుశాంత్ మాజీ స్నేహితురాలు అంకిత లోకాండే కూడా సుప్రీం తీర్పును స్వాగతిస్తూ ట్వీట్ చేసింది. రియా కోరింది.. సుప్రీం అనుగ్రహించిందని నటుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి ట్వీట్ చేశారు. పాట్నాలో తనపై నమోదు అయిన ఎఫ్ఐఆర్‌ను ముంబైకి బదిలీ చేయాలని రియా సుప్రీంలో పిటిషన్ పెట్టుకున్నది. వాస్తవానికి ఆ అభ్యర్థనపై ఆగస్టు 11వ తేదీన విచారణ జరిగింది. కానీ జస్టిస్ హృషికేశ్ రాయ్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. సుశాంత్ మృతి కేసు మిస్టరీగా మారిన విషయం తెలిసిందే. సుశాంత్ ఆత్మహత్య చేసుకున్నట్లు ముంబై పోలీసులు తేల్చినా.. ఆ కేసులో పలు అనుమానాలు ఉన్నాయి. ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే.. ముంబై పోలీసులు ఇప్పటికే సుమారు 50 మంది బాలీవుడ్ ప్రముఖుల్ని ప్రశ్నించారు. అయితే ఈ కేసులో సుశాంత్ తండ్రి పిటిషన్ దాఖలు చేయడంతో కేసు కొత్త మలుపు తిరిగింది. గర్ల్‌ఫ్రెండ్ రియాపై అనుమానాలు వ్యక్తం కావడం కూడా ఆసక్తిగా మారింది. సుశాంత్ అకౌంట్లో ఉన్న కోట్ల డబ్బు ఎక్కడికి.. ఎలా వెళ్లిందన్నది మరింత మిస్టరీగా మారింది. సుశాంత తండ్రి ఫిర్యాదు మేరకు బీహార్‌లో ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. తొలుత రియా కూడా సీబీఐ విచారణ కోరుతూ సుప్రీంను ఆశ్రయించింది. సుశాంత్ గర్ల్‌ఫ్రెండ్ రియా తరపున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్, మహారాష్ట్ర తరపున సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మను సింఘ్వి వాదించారు. సుశాంత్ మృతి కేసు విచారణ ముంబైలో జరగాలని మహారాష్ట్ర వాదిస్తున్నది. పాట్నాలో నమోదు అయిన ఎఫ్ఐఆర్ .. జీరో ఎఫ్ఐఆర్ అంటూ సింఘ్వి వాదించారు. ఇక ఇదే కేసులో బీహార్ రాష్ట్రం తరపున మనిందర్ సింగ్ వాదించారు. సుశాంత్ తండ్రి రాజ్‌పుత్ తరపున సీనియర్ కౌన్సిల్ వికాశ్ సింగ్ వాదిస్తున్నారు. ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు కాకుండానే ముంబై పోలీసులు విచారణ చేపడుతున్నారని వికాశ్ ఆరోపించారు. సుశాంత్ జూన్ 14వ తేదీన బాంద్రాలోని తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నట్లు ముంబై పోలీసులు నిర్ధారించారు. కానీ తన కుమారుడి మరణానికి రియానే కారణమంటూ సుశాంత్ తండ్రి పిటిషన్ దాఖలు చేశారు.

### విమర్శలు సరికాదన్న శివసేన

బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ మరణం కేసును సీబీఐ దర్యాప్తు చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై రాజకీయ వ్యాఖ్యలు చేయడం సరికాదని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు. చట్టాల గురించి తెలిసిన వారు ప్రభుత్వంలో ఉన్నారని, ముంబై పోలీస్ కమిషనర్ లేదా మహారాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ దీని గురించి మాట్లాడవచ్చని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించాలని సంజయ్ రౌత్‌ను మీడియా కోరగా దీనిపై తాను మాట్లాడటం సబబు కాదని అన్నారు. తమ రాష్ట్ర న్యాయవ్యవస్థ ఎప్పుడూ దేశంలో అత్యుత్తమమైనదని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదన్న ఆయన అందరికీ న్యాయం అందించడం ఒక ప్రమాణమని చెప్పారు. బాలీవుడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణం కేసును సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగిస్తూ బుధవారం తీర్పు ఇచ్చింది. ఈ కేసులో మహారాష్ట్ర పోలీసులు సీబీఐకి సహకరించాలని ఆదేశించింది. ఇప్పటి వరకు ఈ కేసుపై దర్యాప్తు జరిపిన ముంబై పోలీసులు తమ వద్ద ఉన్న అన్ని వివరాలను సీబీఐకి అప్పగించాలని సుప్రీం కోర్టు పేర్కొంది.

# పేదలకు వరంగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ సాయం

### మున్సిపల్ కార్మికులకు సరుకుల పంపిణీ
### కష్టకాలంలో ఆదుకుంటున్నామన్న మంత్రి జగదీశ్వర్

సూర్యాపేట,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): కష్టకాలంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీకి బుధవారం శ్రీకారం చుట్టిన మంత్రి వరుసగా రెండో రోజు కూడా లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. పెన్‌పహాడ్‌కు సంబంధించి 191 చివ్వెంల మండలాలకు సంబంధించి 196 మంది లబ్ధిదారులకు రూ.3.87 కోట్ల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. గతంలో నిరుపేదలు పెండ్లి చేయాలంటే అష్టకష్టాలు పడేవారని గుర్తు చేశారు. ఆ కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ పెద్దలా ఆలోచించి కల్యాణ లక్ష్మీ వంటి పథకాలను తీసుకువచ్చారన్నారు. కల్యాణ లక్ష్మీ ..షాదీ ముబారక్ పథకాలు పేదలకు వరంగా మారాయన్నారు. ప్రస్తుతం పార్టీలు, కులమతాలకతీతంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కరోనా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న తరుణం లో ప్రదొ ఒక్కరు ఎవరి కి వారు తగు జాగ్రత్తలు పాటిస్తూ తమ రోజు వారీ కార్యకలాపాల్లో పాల్గొనాలని మంత్రి అన్నారు. పెన్ పహాడ్ ఎంపీపీ కార్యాలయంలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి తో పాటు ఎంపీపీ నెమ్మాది భిక్షం, చెవ్వేంల ఎంపీపీ కుమారి బాబు నాయక్, జడ్పీటీసీ మామిడి అనిత, చివ్వేంల జడ్పిటిసి సంజీవ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి నిత్యావసర సరుకులు అందజేశారు. మున్సిపల్ నిధుల నుంచి సుమారు రూ. 15 లక్షల విలువైన కొబ్బరి నూనె, సబ్బులు,చెప్పులు రేయిన్ కోట్ వంటివి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ , వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, భిక్షం, మున్సిపల్ కమిషనర్ మంజులా రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేసిన విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి

# జాతీయ అర్హత పరీక్షల వాయిదా తగదు

### రాజకీయ నేతల డిమాండ్లు సరికాదు
### ప్రధాని మోడీకి పలువురు ప్రొఫెసర్ల లేఖ

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): జేఈఈ-నీట్ పరీక్షలను వాయిదా వేయాలంటూ సోనియా ఆధ్వర్యంలో విపక్షాల భేటీ జరిగిన 24 గంటల్లోనే విద్యార్థుల భవిష్యత్‌పై తీవ్రంగా స్పందించారు. వాయిదా అన్నది విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీసే చర్యని అన్నారు. ఈ మేరకు 150 మంది ప్రొఫెసర్ల బృందం ప్రధాని మోదీకి ఓ లేఖ రాసింది. ప్రతి యేడాది లాగే ఈ యేడాది ఇంటర్మీడియట్ పరీక్షలను చాలా లక్షల మంది విద్యార్థులు రాశారని, తదుపరి లక్ష్యం కోసం వారందరూ ఎదురు చూస్తున్నారని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ప్రభుత్వం జేఈఈ- నీట్ పరీక్షల తేదీలను ప్రకటించిందని, ఒకవేళ వాటిని వాయిదా వేస్తే మాత్రం అత్యంత విలువైన విద్యా సంవత్సరాన్ని వారు కోల్పోయినట్టేనని ఆ లేఖలో స్పష్టం చేశారు. ఆయా విద్యార్థులు కన్న కలలు సాకారమయ్యేలా చూడాలని, ఆ విషయంలో మాత్రం ప్రభుత్వం రాజీ పడకూడదని వారు ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. లేఖరాసిన వారిలో భారత దేశానికి చెందిన వివిధ యూనివర్శిటీ ప్రొఫెసర్లతో పాటు విదేశాలకు చెందిన ప్రొఫెసర్లు కూడా ఉన్నారు. జేఈఈ- నీట్ పరీక్షలను వాయిదా వేయడమంటే విద్యార్థుల జీవితాలతో చెలగాటాలాడడమే అని మోదీకి స్పష్టం చేశారు. తమ సొంత రాజకీయ ప్రయోజనం కోసం కొందరు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అంటూ లేఖలో ప్రొఫెసర్ల బృందం ఆ లేఖలో తీవ్రంగా ఆరోపించింది. యువకులే ఈ దేశానికి భవిష్యత్తు. కానీ కరోనా కారు మబ్బులు వారి కెరీర్‌పై కూడా పడ్డాయి. విద్యా సంస్థల ప్రవేశాల గురించి, తరగతుల గురించి వారిలో చాలా భయాలున్నాయి. వీటిని తొందరగా పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును జాగ్రత్తగా ఉంచడానికి 2020-21 సంవత్సరానికి చెందిన అకాడమిక్ కేలండర్‌ను రూపొందించడంలో ప్రభుత్వం పూర్తి జాగ్రత్తలు తీసుకుంటుంది. జేఈఈ- నీట్ పరీక్షలను కేంద్రం విజయవంతంగా నిర్వహిస్తుందని మేము గట్టిగా విశ్వసిస్తున్నాం అంటూ ఆ ప్రొఫెసర్లు లేఖలో ఆశాభావం వ్యక్తం చేశారు.

## డిండి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు

నల్లగొండ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): డిండి ప్రాజెక్టు పరీవాహక ప్రాంతంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 36అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటి మట్టం 33అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం దుందుభి నది నుంచి 700 క్యూసెక్కులు వరద ప్రవాహం వస్తుండగా ప్రధాన కాల్వకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి నిల్వ 2.45 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2 టీఎంసీ నీటి నిల్వ ఉన్నది. ఇకపోతే పులిచింతల పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 17,964 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుంది. పులిచింతల ప్రాజెక్టు 3 గేట్ల నుంచి 42741 క్యూసెక్కులు నీరు, తెలంగాణ విద్యుత్ కేంద్రం గేట్ల నుంచి 18000 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. డవిదేవులపల్లి మండలకేంద్రానికి చేరువలో ఉన్న టెయిల్‌పాండ్ ప్రాజెక్టుకు నాగార్జునసాగర్ నుంచి సుమారు 28,379 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగిందని ఏడి వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. దీంతో టెయిల్‌పాండ్ ప్రాజెక్ట్ నాలుగు క్రస్టు గేట్లను ఒక మీటరు మేర ఎత్తి 16,424 క్యూసెక్కుల నీటిని దిగువనున్న పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## నిరాడంబరంగా గణేశ్ నిమజ్జనాలు

ఆదిలాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): కరోనా కారణంగా గణపతి నవరాత్రోత్సవాలు శనివారం నిరాడంబరంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఉత్సవాలు ఇళ్లకే పరిమితమయ్యాయి. కరోనా కట్టడిలో భాగంగా ఉత్సవాలకు ప్రభుత్వం అనుమతించలేదు. ఇళ్లలోనే చిన్న గణపతులను, మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజ కార్యక్రమాలను జరిపారు. అలాగే నిమజ్జనాలను కూడా ఎవరికి వారు చేసేస్తున్నారు. ఎక్కడా ఆర్భాటం లేకుండా గణపతుల నిమజ్జనం కూడా సాదాసీదాగా సాగుతోంది. భైంసా లాంటి ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెట్టారు. దేవాలయాల్లో చిన్న విగ్రహాలను ఏర్పాటు చేసి పరిమితమైన భక్తుల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వ హిస్తున్నారు. గతంలో వాడవాడల నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా లంబోదరుడి మండపాల వద్ద మైకుల హోరు, భక్తుల కోలాహలం, భజనలు, ప్రత్యేక పూజలతో సందడి కనిపించేది. ఈ ఏడాది మండపాలు ఎక్కడ ఏర్పాటు చేయలేదు. అన్ని పట్టణాల్లోనూ కరోనా నిబంధనలకు అనుగుణంగా ఇళ్ళలోనే వినాయకులను ప్రతిష్ఠించి పూజలు చేశారు. గత సంవత్సరం వేలాదిగా వినాయక మండపాలను ఏర్పాటు చేయగా, ఈసారి అక్కడక్కడ మూడు అడుగుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. కొవిడ్ నిబంధనలు పాటిస్తూ భౌతికదూరం పాటిస్తూ పూజలు చేశారు. కరోనా నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వేడుకలు జరుపుకోవాలని పోలీసులు ముందే సూచించారు.దీంతో ఆర్భాటం లేకుండా నిమజ్జన కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి.

## పచ్చదనానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

జగిత్యాల,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జడ్పీ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం తరిగిపోతున్న అడవులకు జీవం పోస్తున్నదని తెలిపారు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు సహకారంతో అడవుల పునరుద్ధరణకు కృషి చేస్తామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యాక్రమాలు బాగా అమలు చేశామన్నారు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అదుపులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా అందజేస్తున్న నిధులతో పారిశుద్ధ్య నిర్వహణతోపాటు అనేక ప్రాంతాల్లో సుందరీకరణ పనులు చేస్తున్నామన్నారు. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయంలోనూ అభివృద్ధి నిరాటంకంగా జరుగుతున్నదని అన్నారు. స్వీయ నియంత్రణతోనే కరోనా అదుపులో ఉంటుందన్నారు. పాజిటివ్‌గా నిర్ధారణైన వారి ఇళ్లు పరిసర ప్రాంతాలను సోడియం హైపోక్లోరైట్‌తో శానిటైజేషన్ చేయిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటిస్తూ, మాస్కులు ధరించాలన్నారు. కరోనా నియంత్రణకు వ్యక్తిగత పరిశుభ్రతే మేలని అన్నారు.

## వర్షాలతో ప్రాజెక్టులకు జలకళ: ఎమ్మెల్యే

కరీంనగర్,ఆగస్ట్27(నేటినిజం ప్రతినిధి): ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు అన్ని చెరువులు, కుంటలు పూర్తిగా జలకళను సంతరించుకున్నాయని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. అధిక వర్షపాతం నమోదు కావడంతో వరి పొలాలు నీట మునిగి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వానల కారణంగా నష్టపోయిన రైతులను, ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని పేర్కొన్నారు. అన్నపూర్ణ ప్రాజెక్టు దాదాపు రెండున్నర టీఎంసీల నీటితో ప్రాజెక్టు జలకళను సంతరించుకున్నదని, మరి కొద్దిరోజుల్లో పూర్తి స్థాయి జలకళ వస్తుందన్నారు.

ఇదిలావుంటే అకాల వర్షాలతో నియోజకవర్గంలో జరిగిన నష్టంపై నివేదిక రూపొందించాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో కూలిన ఇండ్లు, తెగిన రోడ్లు, కల్వర్టులు, చెరువులు, కుంటలు, పంట నష్టంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. రైతు వేదికలు, రైతు మార్కెట్లతో పాటు ఉపాధిహామీ పనులు పూర్తి చేయాలని చెప్పారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సరిగా పనిచేయకపోతే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కరోనా వైరస్‌తో అన్నిదేశాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, కష్టకాలంలోనూ టీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని అన్నారు. గన్నేరువరం మండలం ఒకప్పుడు కరువు ప్రాంతంగా ఉండేదని, ఇప్పుడు చెరువులు నిండుకుండల్లా మారాయని సంతోషం వ్యక్తంచేశారు. గ్రామాల్లో కరోనా పాజిటివ్ వచ్చిన వారిని అంటరాని వారిగా చూడవద్దని, వారికి మనోధైర్యాన్ని కల్పించాలని చెప్పారు.

## ఓజోన్ గ్యాస్‌తో కరోనా కంట్రోల్

### డిఎస్ ఇన్‌ఫెక్ట్‌తో మంచి ఫలితాలు
### జపాన్ శాస్త్రవేత్తల వెల్లడి

టోక్యో,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి విజృంభణ కొనసాగుతున్న వేళ వైరస్ బారి నుంచి జనాలను కాపాడటానికి పలు పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో జపాన్ శాస్త్రవేత్తలు ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. తక్కువ సాంద్రత కలిగిన ఓజోన్ గ్యాస్ కరోనా వైరస్ కణాలను తటస్తం చేయగలదని తెలిపారు. అందువల్ల ఆస్పత్రులు, పరీక్షా కేంద్రాలు వంటి ప్రదేశాల్లో దీన్ని డిస్‌ఇన్‌ఫెక్ట్‌గా ఉపయోగించాలని సూచిస్తున్నారు. ఫుజిటా హెల్త్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు ఒక సమావేశంలో మాట్లాడుతూ.. ఓజోన్ వాయువు 0.05 నుంచి 0.1 పీపీఎం, మానవులకు హానిచేయనిదిగా భావించే స్థాయి వైరస్‌ని చంపగలదని గుర్తించాము అన్నారు. ఈ ప్రయోగంలో వారు కరోనా వైరస్ నమూనా ఉన్న కలిగిన మూసివున్న గదిలో ఓజోన్ జనరేటర్‌ను ఉపయోగించారు. దాదాపు 10 గంటల పాటు తక్కువ సాంద్రత గల ఓజోన్ గ్యాస్‌ను ఉపయోగించడం వలన.. వైరస్ శక్తి 90 శాతం తగ్గినట్లు గుర్తించామన్నారు. ఈ సందర్భంగా చీఫ్ సైంటిస్ట్ తకాయుకి మురాటా మాట్లాడుతూ.. 'కరోనా వైరస్ వ్యాప్తిని తగ్గించడం కోసం.. ప్రజలు ఉన్న వాతావరణంలో కూడా నిరంతర, తక్కువ సాంద్రత కలిగిన ఓజోన్ వాయువును పంపించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. అధిక తేమతో కూడిన పరిస్థితుల్లో కూడా ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుందని మేము గుర్తించాము' అన్నారు. ఓజోన్, ఒక రకమైన ఆక్సిజన్ అణువు. ఇది అనేక వ్యాధికారకాలను క్రియారహితం చేస్తుంది. 1-6 పీపీఎం మధ్య అధిక సాంద్రత కల ఓజోన్ వాయువు కరోనా వైరస్‌కు వ్యతిరేకంగా ప్రభావవంతంగా పని చేస్తుంది. అయితే ఈ అధిక సాంద్రత మానవులకు విషపూరితమైనది అని గతంలో చేసిన ప్రయోగాలు నిరూపించాయి. జార్జియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇటీవల జరిపిన ఒక అధ్యయనం ప్రకారం మనం నిత్యం వాడే గౌన్లు, గాగుల్స్, ఇతర వైద్య రక్షణ పరికరాలను డిస్‌ఇన్‌ఫెక్ట్ చేయడంలో ఓజోన్ ప్రభావవంతంగా ఉంటుందని తేలింది. సెంట్రల్ జపాన్‌లోని ఐచి ప్రిఫెక్చర్‌లోని ఫుజిటా మెడికల్ యూనివర్శిటీ హాస్పిటల్, వెయిటింగ్ రూంలు, రోగుల గదుల్లో వైరస్ సంక్రమణను తగ్గించడానికి ఓజోన్ జనరేటర్లను ఏర్పాటు చేసింది.

## వివాహ వేడుకలో పాల్గొన్న 50మందికి కరోనా

బోధన్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ పరిధిలోని చెక్కీ క్యాంపులో పదిరోజుల కిందట జరిగిన ఒక వివాహ వేడుక కారణంగా 50 మంది కరోనా బారిన పడ్డారు. కేవలం 193 గృహాలున్న క్యాంపులో 42 ఇళ్లలోని వారికి వైరస్ సోకింది. అయితే వారి ఆదాయ మార్గమైన గేదెల ఆలనాపాలనా ఇప్పుడు ఆందోళనకరంగా మారింది. మరోపక్క కొవిడ్ భయంతో ఇక్కడ పాలు కొనడానికి ఎవరూ రావడం లేదు. పాల కేంద్రం 20 రోజులు మూసి ఉంచాలని నిర్ణయించారు.

# తెలంగాణకు రావాల్సిన జీఎస్టీ బకాయిలు విడుదల చేయాలి : మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్ ఆగష్టు 27: తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ బకాయిలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గురువారం వర్చువల్ విధానంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ఆధ్వర్యంలో 41వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రం తరఫున ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు రాష్ట్ర ప్రతిపాదనలు, డిమాండ్లను వివరించారు. రాష్ట్రానికి రావాల్సిన రూ.2700 కోట్లను త్వరగా విడుదల చేయాలని కోరారు. జీఎస్టీ పరిహారం కేంద్ర ప్రభుత్వమే చెల్లించాలన్నారు. రాష్ట్రానికి రావాల్సిన రూ.5,420 కోట్లు విడుదల చేయాలన్నారు. పరిహారంలో సెస్ మిగిలితే కన్సాలిడేట్ ఫండ్‌లో జమ చేసి కేంద్రం వాడుకుంటుందోని, సెస్ తగ్గినప్పుడు రాష్ట్రాలు అప్పుడు తీసుకోవాలనడం సరికాదన్నారు. ఐజీఎస్టీ సమావేశం వెంటనే నిర్వహించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

# తల్లిదండ్రులు ఒత్తిడి మేరకే నీట్ తదితర పరీక్షలు

### -కేంద్రమంత్రి పోఖ్రియాల్ వివరణ

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): నీట్, జేఈఈ నిర్వహణ వాయిదా వేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశం నిర్ణయించిన తరుణంలో, కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ స్పందించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ, ఈ పరీక్షలను నిర్వహించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. జేఈఈ (జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (మెయిన్))ను సెప్టెంబరు 1 నుంచి 6 వరకు, నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్)ను సెప్టెంబరు 13న నిర్వహించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్ణయించింది. రమేశ్ పోఖ్రియాల్ ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, పరీక్షలను నిర్వహించాలని తమపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. రెండుసార్లు వాయిదా వేసిన తర్వాత వీటి తేదీలను ఖరారు చేసినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు సైతం పూర్తి విద్యా సంవత్సరం వృథా కారాదని చెప్పిందని గుర్తు చేశారు. ఈ పరీక్షార్థుల్లో 85 శాతం మంది అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. 8.85 లక్షల మంది జేఈఈ పరీక్షకు నమోదు చేసుకున్నారని, వీరిలో 7.25 లక్షల మంది అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పారు. జేఈఈ, నీట్ వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈ నెల 17న తిరస్కరించిన సంగతి తెలిసిందే. పూర్తి విద్యా సంవత్సరం వృథా కారాదని, మహమ్మారి ఉన్నప్పటికీ జీవితం సాగాలని తెలిపింది. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఈ పరీక్షలను వాయిదా వేయాలని, లేదంటే, ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించాలని కోరుతోంది.

# మారిటోరియం కాలంలో వడ్డీ వసూళ్లా

### ఆర్‌బిఐ సడలింపులపై ఎందుకు స్పందించరు
### వడ్డీలపై వడ్డీ వసూళ్ళు చేయడంపై ఆగ్రహం
### వెంటనే సమాధానం ఇవ్వాలని కేంద్రానికి ఆదేశం
### కేంద్రంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంజూరు చేసిన మారటోరియం వ్యవధిలో వడ్డీ మాఫీ అంశంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఆరు నెలల రుణ మారటోరియం కాలానికి వడ్డీని మాఫీ చేసే అంశంపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని కోరింది.

వడ్డీ మీద వడ్డీ విధిస్తారా అంటూ గతంలోనే ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీం బుధవారం మరోసారి కేంద్రం వైఖరిపై మండిపడింది. ఆర్‌బీఐ పేరు చెప్పి ఎంతకాలం దాక్కుంటారని వ్యాఖ్యానించింది. ఆర్థిక ఉద్దీపన వల్ల ఎంత మందికి ప్రయోజనం, నిజంగా ప్రజలకు మేలు జరిగిందా అని ప్రశ్నించింది. వ్యాపార ఉద్దేశ్యాలు పక్కనబెట్టి ప్రజల కష్టాలు తీర్చాలని సూచించింది. దీనిపై సెప్టెంబర్ ఒకటవ తేదీ నాటికి పూర్తి నివేదిక సమర్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇప్పటివరకూ పరిశ్రమకు సంబంధించిన ఆందోళనలతోనే ఆర్‌బీఐ సరిపెట్టు కుందని, ప్రభుత్వం కూడా ఆర్‌బీఐ వెనుక దాక్కుంటోందని సుప్రీం విరుచుకుపడింది.

వడ్డీమాఫీ, వడ్డీపై వడ్డీ మాఫీ అంశంపై విపత్తు నిర్వహణ చట్టం ప్రకారం కేంద్రం తన వైఖరిని స్పష్టం చేయాలని పేర్కొంది. వడ్డీ మాఫీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందన దాఖలు చేయాలని జస్టిస్ అశోక్ భూషణ్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. అనంతరం విచారణను సుప్రీం కోర్టు సెప్టెంబర్ 1 కి వాయిదా వేసింది. ప్రభుత్వం వ్యాపారం గురించి మాత్రమే కాకుండా ప్రజల దుస్థితి గురించి కూడా ఆలోచించాలని హితవు చెప్పింది. ఒత్తిడితో కూడిన ఖాతాలను గుర్తించి, తక్కువ వడ్డీ రేట్ల పరంగా ఉపశమనం కల్పించాలని ఆర్‌బీఐ చూస్తోందని కేంద్రం తరపున వాదిస్తున్నసొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. అలాగే ఇలాంటి అభిప్రాయానికి రావద్దని సుప్రీంకోర్టును కోరారు. దీనిపై సమీక్షించి, నివేదిక అందిస్తామని మెహతా తెలిపారు. కాగా కరోనా వైరస్ కట్టడికి విధించిన లాక్‌డౌన్ కారణంగా బ్యాంకు రుణాలపై రిజర్వు బ్యాంకు విధించిన మారిటోరియం గడువు ఆగస్టు 31తో ముగియనున్న సంగతి తెలిసిందే. ఈ సమస్య కరోనా నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ వల్ల కలిగిందని పేర్కొన్నది. లోన్ మారటోరియాన్ని కేవలం బిజినెస్ కోణంలోనే ఆలోచించడం సరికాదని ప్రజల ఇబ్బందులు పరిగణలోకి తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాయిదా వేసిన ఈఎంఐలపై వడ్డీని వసూలు చేయడాన్ని ఆపివేయడం లేదా మారిటోరియం కాలానికి వడ్డీపై వడ్డీని వసూలు చేయడం వంటి వివిధ అంశాలపై నిర్ణయం తీసుకొని బ్యాంకులను ఆదేశించడానికి కేంద్రానికి అధికారాలు ఉన్నాయని తెలిపింది.

# ఇతరుల పేరు మీద పట్టా చేసిన అధికారులు

### తహసిల్ కార్యాలయంలో తండ్రీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం
### అధికారులు సర్ది చెప్పడంతో తొలగిన టెన్షన్

సిద్దిపేట,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): తహసీల్దార్ కార్యాలయం లోపలికి వెళ్లి తలుపులు వేసుకుని పెట్రోల్ డబ్బాలతో అత్మహత్య చేసుకుంటామని తండ్రీ కూతుళు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. సంవత్సరాల నుంచి కోహెడ ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ తహసీల్దార్ కార్యాలయం లోపలికి వెళ్లి తలుపులు వేసుకుని పెట్రోల్ డబ్బాలతో అత్మహత్య చేసుకుంటామని నిరసన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం చెంచలచెరువులపల్లి గ్రామానికి చెందిన భీంరెడ్డి తిరుపతి రెడ్డి, అతని కుమార్తె స్వరూప తమ భూమి వేరే వాళ్ల పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని వాపోయారు. తన తండ్రి తిరుపతి రెడ్డికి చెందిన ఎకరం 30 గుంటల భూమిని తన పేరుమీద 2011 లో రిజిస్ట్రేషన్ చేయించారని అప్పటినుండి మ్యుటేషన్ చేయాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బాధితురాలు స్వరూప అన్నారు. ఈ మధ్యకాలంలో పహణీలో తన తండ్రి పేరును తొలగించి వేరే వాళ్ల పేరు మీద భూమిని నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న తహసీల్దార్, ఇప్పుడున్న తహసీల్దార్ భూమి మోక మీదకి వచ్చి తనిఖీ చేసి హద్దులు నిర్ణయించి భూమి తమ పేరు మీదనే చేస్తామని చెబుతున్నారు కానీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేరే వ్యక్తి తమ భూమిలో గత కొన్ని రోజులుగా దున్నుతున్నాడని, పోలీసులను ఆశ్రయిస్తే పోలీసులు సైతం తమను తమ కుటుంబాన్ని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసేంతవరకు తహసీల్దార్ కార్యాలయంలోనే ఉంటామని లేకుంటే కార్యాలయంలోనే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. విషయం తెలుసు తహసీల్దార్, పోలీసులు బాధితులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

# జీఎస్టీ బకాయిలు చెల్లించడంలో కేంద్రం విఫలం

### రాష్ట్రాలను వంచించిన మోడీ సర్కార్
### నీట్‌పై సుప్రీంకు వెళ్లే ఆలోచనలో రాష్ట్రాలు
### పలు రాష్ట్రాల సిఎంలతో సోనియా వీడియో కాన్ఫరెన్స్

న్యూఢిల్లీ,ఆగస్ట్27ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ బుధవారంనాడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాలకు వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) పరిహారం చెల్లించేందుకు కేంద్రం నిరాకరించడాన్ని తప్పుపట్టారు. ఇది రాష్ట్రాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం వంచించడమేనని విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, తమ భాగస్వాములుగా ఉన్న పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, జార్ఖండ్ ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సోనియాగాంధీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జీఎస్‌టీ బకాయిలు, జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జీ), నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) (యూజీ) పరీక్షలకు సంబంధించిన అంశాలు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. 'కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై చర్చించాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. మరో మూడు వారాల్లో పార్లమెంటు సమావేశం కానుది. ఆ కారణంగా మనమంతా పరస్పరం చర్చించుకుని, సహకరించుకోవాల్సి ఉంది. జీఎస్‌టీ పరిహారం చాలా పెద్ద అంశంగా కనిపిస్తోంది. పార్లమెంటులో ఆమోదించిన చట్టానికి అనుగుణంగా నిర్దేశిత కాలానికి పరిహారం చెల్లించాల్సి ఉంది. బకాయిలు పేరుకుపోతున్నాయి. అన్ని రాష్ట్రాలుఆర్థికంగా బాగా దెబ్బతిన్నాయి' అని సోనియాగాంధీ ఈ సందర్భంగా అన్నారు.'ఆగస్టు 11న జరిగిన స్టాండింగ్ కమిటీ ఆఫ్ ఫైనాన్స్ సమావేశంలో ప్రస్తుత సంవత్సరానికి చెల్లించాల్సిన 14 శాతం పరిహారం చెల్లించే పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం లేదని ఆర్థిక కార్యదర్శి చాలా స్పష్టంగా చెప్పారు. పరిహారం నిరాకరణ అనేది రాష్ట్రాలను, దేశ ప్రజలను మోదీ సర్కార్ పూర్తిగా వంచించడమే అవుతుందని సోనియా ఘాటుగా విమర్శించారు. రాష్ట్రాలతో పంచుకోనవసరం లేని ఏకపక్ష సెస్‌లతో కేంద్ర ప్రభుత్వం లాభపడుతూనే ఉందని అన్నారు. ఎగ్రికల్చరల్ మార్కెటింగ్‌పై రాష్ట్రాలను సంప్రదించకుండా, ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఆర్డినెన్స్ తేవడం అప్రజాస్వామికమని సోనియాగాంధీ అన్నారు.

దశాబ్దాలుగా కల్పించిన పబ్లిక్ సెక్టార్ ఆస్తులు అమ్మేస్తున్నారని, 6 విమానాశ్రయాలు ప్రైవేటు వ్యక్తుల చేతిలో పెడుతున్నారని, రైల్వేలను సైతం ప్రైవేటు పరం చేస్తున్నారని పేర్కొన్నారు. నూతన విద్యా విధానం కూడా ప్రగతిశీల, సెక్యులర్, శాస్త్రీయ విలువలకు విఘాతమని, విద్యార్థులు, పరీక్షలకు సంబంధించిన ఇతర సమస్యలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయని సోనియాగాంధీ అన్నారు. మరోవైపు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన జేఈఈ, నీట్ వాయిదాకు ఉమ్మడిగా పోరాడాలని బీజేపీయేతర పాలిత ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిర్ణయించారు. దీనిపై సుప్రీంకోర్టును మరోసారి ఆశ్రయించి సమీక్ష కోరాలని భావించారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, పశ్చిమ బెంగాల్ మమతా బెనర్జీ కలిసి బుధవారం ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రుల ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించారు. మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌తోపాటు నాలుగు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలసీఎంలు అమరీందర్ సింగ్ (పంజాబ్), అశోక్ గెహ్లాట్ (రాజస్థాన్), భూపేశ్ బాఘేల్ (ఛత్తీస్‌గఢ్) వీ నారాయణస్వామి (పుదుచ్చేరి) పాల్గొన్నారు. సహకార వ్యవస్థ పేరుతో రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తున్నదని మమతా బెనర్జీ ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దారుణాలు ఎప్పుడూ చూడలేదని విమర్శించారు. కరోనా నేపథ్యంలో జేఈఈ, నీట్ పరీక్షలు విద్యార్థులను మనోవేదనకు గురిచేస్తున్నాయని చెప్పారు. వాయిదా కోరుతూ ప్రధాని మోదీకి లేఖ రాసినా ప్రయోజనం లేకపోయిందని మమతా అన్నారు. విద్యార్థుల జీవితాలను ప్రమాదంలో పడేయడం ఎందుకని ఆమె ప్రశ్నించారు. జేఈఈ, నీట్ వాయిదా కోసం అందరం కలిసి సుప్రీంకోర్టుకు వెళ్దామని పిలుపునిచ్చారు. మరోవైపు సుప్రీంకోర్టుకు వెళ్లే ముందు ప్రధాని మోదీ, రాష్ట్రపతిని కలుద్దామని జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ సూచించగా మమతా దానికి అంగీకరించారు. అయితే ప్రధాని మోదీ మన విన్నపాన్ని పట్టించుంటారా అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. కాగా జేఈఈ, నీట్ పరీక్షలు నిర్వహించే పరిస్థితి తమ రాష్ట్రంలో లేదని సోరెన్ చెప్పారు. విద్యార్థుల కోసం హోటళ్లు, బస్సులు పునరుద్ధరిస్తే కరోనా వ్యాప్తి మరింతగా పెరిగేఅవకాశమున్నదని అన్నారు. దీనిపై కేంద్రమే ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తన తల్లిదండ్రులిద్దరికి కరోనా సోకిందని హేమంత్ సోరెన్ తెలిపారు. మన సమస్యలన్నింటిపై ఉమ్మడిగా గళమెత్తుదామని ఆయన అన్నారు. జేఈఈ, నీట్ వాయిదాకు సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న ప్రతిపాదనకు పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ మద్దతు తెలిపారు. తమ రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉన్నదని అన్నారు. కరోనా నియంత్రణకు సుమారు రూ.500 కోట్లు ఖర్చుచేసినట్లు ఆయన చెప్పారు. తమ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిందన్నారు. జీఎస్టీ పరిహారాన్ని కేంద్రం చెల్లించలేదని ఆయన విమర్శించారు.

# శ్రీశైలం ఘటనలో సిఐడి విచారణతో లాభం లేదు

### సిఎం కెసిఆర్‌కు కాంగ్రెస్ నేతల లేఖ

హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): శ్రీశైలం ఘటనపై అన్నీ వేళ్లూ ప్రభుత్వం వైపే చూపిస్తున్నాయని.. పవర్ ప్లాంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదానికి సంబంధించి సీఐడీ విచారణలో విశ్వసనీయత లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్‌కు ఎంపీ రేవంత్ రెడ్డి, మల్లు రవి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణలు లేఖ రాశారు. నిర్లక్ష్యం, అవినీతి కారణంగానే ఘటన జరిగినట్టు అర్థమవుతోందని, ఉద్యోగుల ఆరోపణలు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. జెన్‌కో కేంద్ర కార్యాలయంలో సంతాప సభ పెట్టకపోవడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. అమ్రాబాద్ అడవుల్లో సభ పెట్టుకుని, కన్నీళ్లు పెట్టుకునే దుస్థితికి మీరే కారణమని సీఎం కు రాసిన లేఖలో తెలిపారు. ఘటన వెనుక నిర్లక్ష్యం, అవినీతి ఉందనడానికి సాంకేతిక ఆధారాలున్నాయని, కేంద్ర ఇంధనశాఖ మాజీ కార్యదర్శి శర్మ ఇదే అనుమానం వ్యక్తం చేశారన్నారు. అగ్ని ప్రమాద సంఘటనను చిన్నదిగా చూపే ప్రయత్నం దుర్మార్గమంటూ వాస్తవాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ కోరాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలు మిమ్మల్ని అనుమానిస్తారని, మీరు స్పందించకుంటే తదుపరి కార్యచరణకు వెళతామని సీఎం ను ఉద్దేశించి అన్నారు. ఉద్యోగుల డిమాండ్ మేరకు పరిహారం ఇవ్వాలన్నారు. ఇంటికో ఉద్యోగం, హైదరాబాద్ లో 500 గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కరోనా పరీక్షలను రెట్టింపు చేస్తాం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): ఢిల్లీలో కరోనా కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతున్నది. దీంతో కరోనా పరీక్షలను రెట్టింపు చేస్తామని సీఎం అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. ప్రస్తుతం రోజుకు 20,000 కరోనా పరీక్షలు నిర్వహిస్తుండగా ఇకపై రోజుకు 40,000 పరీక్షలు జరుపుతామన్నారు. కరోనా పరీక్షలు చేయించుకోవడానికి సిగ్గుపడకూడదని, ముందుకు రావాలని ప్రజలకు మరోసారి పిలుపునిచ్చారు. మనం, మన చుట్టుపక్కల వారు సురక్షితంగా ఉండేందుకు కరోనా లక్షణాలున్న వారు తప్పకుండా పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారికి పల్స్ ఆక్సీమీటర్, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్‌ను ప్రభుత్వం అందజేస్తుందని ఆయన చెప్పారు. ఢిల్లీలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 1.64 లక్షలు దాటగా ఇప్పటి వరకు 4,330 మంది మరణించారు.

# తెలంగాణకు అన్యాయంగా కేటాయించారు

### సుప్రీంలో ఎపి ఉద్యోగుల పిటిషన్

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): ధర్మాధికారి నివేదిక పేరుతో తమను ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు అన్యాయంగా కేటాయించారని ఏపీ ఉద్యోగులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎంఆర్ షాలతో కూడిన సుప్రంకోర్టు బెంచ్ బుధవారం విచారించింది. ఏపీ రిలీవ్ చేసిన ఆంధ్ర ఉద్యోగుల తరపున సీనియర్ న్యాయవాది నరసింహ వాదనలు వినిపించారు. తాము ఏపీలో జన్మించి, విద్యను అభ్యసించి అక్కడే ఉద్యోగంలో చేరినా, తమను అక్రమంగా తెలంగాణకు కేటాయించి జీతాలు ఇవ్వడం నిలిపివేశారని కోర్టుకు నివేదించారు. ఏపీ వైశాల్యం, జనాభా, విద్యుత్ ఉత్పత్తిలో అధికమైనా ఉద్యోగులను మాత్రం తెలంగాణకు అధికంగా కేటాయించారని, ఈ నివేదికను తోసిపుచ్చాలని కోరారు. ఈ వాదనను ఏపీ విద్యుత్ సంస్థల సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వ్యతిరేకించారు. ధర్మాధికారి తుది నివేదికలో జోక్యం అవసరం లేదని అన్నారు. ఇక జస్టిస్ ధర్మాధికారి గత ఏడాది తుది నివేదిక ఇచ్చిన అనంతరం వివాదంతో సంబంధంలేని 584 మంది ఏపీ ఉద్యోగులను తెలంగాణకు కేటాయించారని తెలంగాణ తరపు న్యాయవాదులు వివరించారు. ఇరుపక్షాల వాదనలను విన్న సర్వోన్నత న్యాయస్థానం ఏపీ విద్యుత్ సంస్థలు, కేంద్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. రెండు వారాల అనంతరం విచారణను తిరిగి చేపడతామని స్పష్టం చేసింది.

# దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు

### మరో 1,023 మంది కోవిడ్‌తో మృతి
### అయినా ఆశాజనకంగా రికవరీ రేటు

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): భారత్‌లో కరోనా విజృంభణ కొనసాగుతోంది. దేశంలో రికార్డు స్థాయిలో ఒక్కరోజే 75,760 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అదే విధంగా గడిచిన 24 గంటల్లో 1,023 మంది కోవిడ్‌తో మృతి చెందారు. దీంతో దేశంలో కరోనా మరణాల సంఖ్య 60,472కు చేరింది. ఇక భారత్‌లో ప్రస్తుతం 7,25,991 యాక్టివ్ కేసులు ఉండగా.. మొత్తంగా కరోనా బాధితుల సంఖ్య 33,10,235కు చేరుకుంది. వీరిలో 25,23,772 మంది కరోనాను జయించి డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటన విడుదల చేసింది. కరోనా వైరస్ వ్యాప్తి అంతకంతకూ విస్తరిస్తున్నప్పటికీ రికవరీ రేటు 76.24 శాతానికి చేరడం సానుకూల అంశంగా పరిణమించింది. కాగా దేశంలో నమోదైన మొత్తం కేసులలో యాక్టివ్ కేసుల శాతం 21.93గా ఉండగా.. కరోనా మరణాల 1.83 శాతానికి తగ్గింది. ఇక గడచిన 24 గంటలలో దేశ వ్యాప్తంగా నిర్వహించిన కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షల సంఖ్య 9,24,998. ఇప్పటి వరకు దేశంలో నిర్వహించిన మొత్తం కోవిడ్ టెస్టుల సంఖ్య 3,85,76,510గా ఉంది. ఇకపోతే కరోనా వ్యాక్సిన్‌ను అన్ని దేశాలకు నిష్పక్షపాతంగా పంపిణీ చేయడం సవాల్‌తో కూడుకున్న విషయమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ముఖ్య శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్ తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బెంగళూరు (ఐఐఎంబీ)లో జరిగిన ఓ కార్యక్రమంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆమె మాట్లాడారు. కరోనా వ్యాక్సిన్‌కు సంబంధించి 2021 ప్రారంభంలో మనం శుభవార్త వినొచ్చన్నారు. అయితే వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చాక అన్ని దేశాలకు సమ ప్రాధాన్యంతో దానిని పంపిణీ చేయడం సవాల్‌తో కూడుకున్న విషయం అని సౌమ్య స్వామినాథన్ తెలిపారు. వ్యాక్సిన్ల తయారీ కేంద్రంగా భారత్‌కు మంచి పేరు ఉన్నది. కరోనా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడానికి ఆ దేశంలో ఇప్పటికే పలు కంపెనీలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఈ రెండు విషయాలను పరిగణనలోకి తీసుకుంటే భారత్ మెరుగైన స్థితిలోనే ఉన్నట్లు అర్థమవుతున్నదని చెప్పారు.

# పూర్వ విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలి

### గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపు

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): విశ్వవిద్యాలయాలు,ఇతర విద్యాసంస్థలు తమ పూర్వవిద్యార్థుల సేవలను వినియోగించుకోవడానికి కృషి చేయాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు, ప్రయోగశాలల అభివృద్ధికి , గ్రంధాలయాల బలోపేతానికి , విద్యార్థులకు మేలు చేసే ఇతర ఉపయుక్త పనులకు పూర్వవిద్యార్థుల సేవలు వినియోగించుకోవాలన్నారు. పూర్వవిద్యార్థుల నెట్‌వర్క్ కోసం నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ గవర్నర్ సూచన మేరకు రాజ్‌భవన్‌లో ఒక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులతో ఒక సమర్థవంతమైన నెట్‌వర్క్ ఏర్పాటు చేసే దిశగా విశ్వవిద్యాలయాలు కృషి చేయాలన్నారు. రాష్ట్రస్థాయిలో పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్ ఏర్పాటు కోసం విశ్వవిద్యాలయాల చాన్సలర్‌గా త్వరలోనే గొప్ప ప్రణాళిక రూపొందిస్తున్నామని గవర్నర్ వివరించారు. పూర్వ విద్యార్థులు విశ్వవిద్యాలయాలకు, ఇతర విద్యాసంస్థలకు గొప్ప వనరులని చెప్పారు. వారి నైపుణ్యాలను, సాయాన్ని అనుభవాన్ని, వారి మార్గనిర్దేశాలను వినియోగించుకుని విద్యాసంస్థలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని గవర్నర్ సూచించారు. ప్రస్తుత విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌కు, ప్రాజెక్ట్ ఫండింగ్‌కు, ఈవెంట్స్ నిర్వహణకు, స్టార్టప్‌ల నిధులకు పూర్వ విద్యార్థులను, వారి సంస్థలను సహకరించి ముందుకు వచ్చే దిశగా ప్రయత్నాలు సాగాలని అన్నారు.

# కార్యకర్త తండ్రి పాడె మోసిన మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్ నగర్ : రాజకీయ పార్టీలకు కార్యకర్తలే వెన్నెముక లాంటి వారు. తాము నమ్మిన పార్టీ అధికారంలోకి రావడం కోసం కార్యకర్తలు అహర్నిశలు శ్రమిస్తుంటారు. కుటుంబాలకు సైతం దూరమై నమ్మిన పార్టీ కోసం కడవరకు వెన్నంటే ఉంటారు. అయితే చాలా పార్టీలు వారిని ఎన్నికలు అయిపోగానే విస్మరిస్తుంటాయి. కానీ, టీఆర్ఎస్ పార్టీ అలా కాదు అని, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు కష్టకాలంలోనూ అండగా ఉంటామని నిరూపించారు ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్.

మహబూబ్ నగర్ జిల్లాలోని హన్వాడ మండలం కిష్టంపల్లి గ్రామానికి చెందిన టీఆర్ఎస్ కార్యకర్త, సింగల్ విండో చైర్మన్ వెంకటయ్య తండ్రి కావలి చెన్నయ్య అంతిమ సంస్కారాలకు మంత్రి హాజరయ్యారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యకర్తలకు టీఆర్ఎస్ అండగా ఉంటుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.




విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి వికారాబాద్ జిల్లా గొట్టిముక్కుల గ్రామంలోని సర్పన్పల్లి ప్రాజెక్ట్‌లో చేప పిల్లలను వదిలిన మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

# టీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి : మంత్రి కొప్పుల



జగిత్యాల, ఆగష్టు 27 : టీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి జరిగిందని సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. గురువారం పెగడపల్లి మండలం ఎల్లాపూర్, కీచులాటలపల్లి, రాజారామ్ పల్లి గ్రామాల్లో రూ. కోటి 12 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

అనంతరం హరిత హారం కార్యక్రమంలో భాగంగా హరిత హారంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో 60 ఏండ్లలో జంగని అభివృద్ధి ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీ ఆర్ కేవలం కేవలం 6 ఏండ్లలో చేసి చూ పారని అన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందుంచుతున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి స్థానికులు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు, ఎంపీపీ గోలి శోభాసురేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ గంగాధర్, సింగిల్ విండో చైర్మన్లు మంత్రి వేణుగోపాల్, కర్ర భాస్కర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరుపతి నాయక్, వైస్ చైర్మన్ రమణ, స్థానిక టీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రెండోరోజు ముగిసిన నాగరాజు విచారణ

### -కోటి పదిలక్షల లంచంపై ఆరా తీసిన ఎసిబి

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కీసర తహశీల్దార్ నాగరాజు అవినీతి కేసులో రెండో రోజు ఏసీబీ అధికారుల విచారణ ముగిసింది. ఈ కేసులో ఎమ్మార్వో నాగరాజు, వీఆర్వో సాయిరాజ్‌తో పాటు నిందితులుగా ఉన్న అంజిరెడ్డి, శ్రీనాథ్‌లకు సంబంధించి అనేక విషయాలను ఏసీబీ అధికారులు సేకరించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి ఇంట్లో దొరికిన భూ లావాదేవీల డాక్యుమెంట్ల గురించి ఆరా తీశారు. ఈ క్రమంలో కోటి 10 లక్షల రూపాయల డబ్బు ఎవరివి అన్నదానిపై పూర్తి వివరాలు రాబట్టినట్లు సమాచారం. ఎమ్మార్వో నాగరాజు మాత్రం ఏసీబీ అధికారులకు సహకరించనట్లు తెలుస్తోంది. తాజా విచారణలో సైతం ఆయన బ్యాంకు లాకర్లపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. విచారణ అనంతరం ఈ కేసులో నలుగురు నిందితులను ఏసీబీ కార్యాలయం నుంచి చంచల్ గూడ జైలుకు తరలించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
Editor: B. Devadas, Cell: 9000065433
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com